
ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 31.0
కనిష్ఠం : 17.0

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY







రండి..బాబూ రండి!

ఆశావహుల నుంచి నేరుగా దరఖాస్తుల స్వీకరణ

ఎన్నికల రణంకు అన్ని పార్టీలు కత్తులు నూరుతున్నాయి. ఎత్తుకు పైఎత్తులకు దిగుతున్నాయి. పోటీకి తలపడే ఆశావహుల జాతకాలను సిద్ధం చేసుకుంటున్నాయి. ఇంకో వైపు భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్ పార్టీలు తాజాగా పోటీ చేయాలనుకున్న వారి నుంచి దరఖాస్తులు కోరా యి. సంక్రాంతి పండుగకు ముందే బీజేపీ నుంచి పోటీ చేసేందుకు పెద్ద సంఖ్యలో ఆశావహులు తమ దరఖాస్తులను సంబంధిత నేతలకు అందిం చారు. ఇప్పుడు కాంగ్రెస్ ఆ తరహా కసరత్తుకు దిగింది. నేటి నుంచి అసెంబ్లీ, పార్లమెంటు స్థానా లకు పోటీ చేయాలనుకున్న వారంతా ఒక అప్లి కేషన్ ఇవ్వండంటూ ఇప్పటికే సూచించింది. వైసీపీ, టీడీపీ, జనసేన ఆశావహుల జాబితాలను సరిచూసుకోవడం, గెలుపు గుర్రాలను బరిలోకి దింపేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లలో మునిగి తేలుతున్నాయి.

- కాంగ్రెస్, బీజేపీల నుంచి ఆహ్వానాలు
- నియోజకవర్గాల నుంచి భారీగా దరఖాస్తులు
- ఎన్నికల పొత్తు ఉంటుందంటూ క్షేత్రస్థాయి ప్రచారమే దీనికి కారణం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న ఆశావహులు అన్ని పార్టీల్లోనూ భారీగా పెరుగుతు న్నారు. ఒకవైపు సామాజిక, ఆర్థిక బలం ఉన్న వారే కాకుండా దీర్ఘకాలికంగా ఒకే పార్టీని నమ్ముకుని ఉన్న వారిలో సీనియర్లు సైతం ఈసారి బరిలోకి దిగాలని ఉత్సాహపడుతున్నారు. దీనికి అనుగుణంగానే తమకు పరిచయం ఉన్న రాష్ట్రస్థాయి నేతలతో సంప్రదింపులు చేస్తున్నారు. ప్రత్యేకించి షర్మిల రాకతో కాస్త కాకెక్కిన కాంగ్రెస్‌లోను ఇదే ఉత్సాహం తొంగి చూస్తోంది. ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలకు ఎవరైతే ఉత్సాహవంతులు ఉన్నారో వారందరి దరఖాస్తులను బుధవారం నుంచి స్వీకరిస్తున్నారు. రెండు రోజుల క్రితమే జిల్లాలో ముఖ్యులకు ఈ తరహా వర్తమానం అందింది. పీసీసీ రాష్ట్ర కార్యాలయంలోనే దరఖాస్తులు అందిం చాలని షరతు పెట్టారు. వాస్తవానికి కాంగ్రెస్‌లో పాత తర మంతా ఇప్పటికే పోటీ సిద్ధపడలేనంత వయో భారంలో ఉన్నారు. ఈ మధ్యన కాస్తోకూస్తో రాజకీయ ప్రేరణ ఉన్నవారు మాత్రమే పోటీకి వీలుగా దరఖాస్తులకు సిద్ధమవుతున్నారు. ఆయా నియోజకవర్గాల నుంచి బరిలోకి దిగుతామని ఆసక్తి చూపుతున్న వారి సంఖ్య ప్రతీ నియోజకవర్గంలోను అరడజనుకు పైగానే ఉంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి పోటీ చేయాలనుకునే ఆశావహులు పెద్ద సంఖ్యలో పార్లమెంటరీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్లతో సంప్రదిస్తున్నారు. తమ అనుభవం, ఆర్థిక బలం, సామాజిక బలం మూడింటిని ప్రస్తావించడమే కాకుండా 2014 తర్వాత ఇప్పటి వరకు కాంగ్రెస్ నుంచి ఇతర పార్టీల్లో చేరిన వారు అక్కడి నుంచి బయటకు వచ్చి కాంగ్రెస్ టికెట్ పొందేందుకు ఏర్పాట్లు చేసు కుంటున్నారు. భీమవరం, ఏలూరు, దెందులూరు, నూజివీడు, తాడేపల్లిగూడెంతో సహా కొన్ని నియోజ కవర్గాల నుంచి సీనియర్లు దరఖాస్తుల వైపు మొగ్గు చూపుతున్నారు. ఏలూరు జిల్లాలో గురు వారం పీసీసీ అధ్యక్షురాలు షర్మిల పర్యటించబోతున్నారు. ఆ సంద ర్భంలోనే తమకు తాముగా పరి చయం చేసుకోవడానికి ఇంకొందరు పోటీ పడుతు న్నారు. ఇదిలా ఉండగా పార్లమెంటరీ నియోజక వర్గాల నుంచి పోటీ చేసే వారి సంఖ్య మిగతా పార్టీల్లోనే అత్యల్పంగా కనిపిస్తుండగా, కాంగ్రెస్ పక్షాన ఎవరు ముందుకు వస్తారనే దానిపై సందిగ్ధత నెలకొంది. నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి సుదీర్ఘ కాలం పాటు పోటీ చేసిన కనుమూరి బాపిరాజు ప్రస్తుతానికి ఏలూరు పార్లమెంటు నియోజకవర్గ కో-ఆర్డినేటర్‌గా ఉన్నారు. పీసీసీ చీఫ్ షర్మిల నేతలతో ముఖాముఖి భేటీకి సిద్ధమవుతున్నారు. సీనియర్లతో పాటు ఉత్సాహవంతులైన నియోజకవర్గ నేతలతో ఆమె సంభాషించబోతున్నారు. తొలుత జిల్లాల వారీగా పర్యటించడం, ఆ తర్వాత ముఖాముఖి భేటీలు, ఎన్నికల చర్చకు తెరలేపబోతున్నారు. సామాజికపరంగా సమతుల్యత లభించేలా అభ్యర్థుల ఎంపిక ఉంటుందని చెబుతున్నారు. పార్టీ నరసాపురం, ఏలూరు కో-ఆర్డినేటర్లు బాపిరాజు, జెట్టి గురునాథరావు ఇప్పటికే పార్టీలో పూర్తి కదలిక తేగలిగారు.

కమలం పార్టీలోనూ కోలాహలం

సంక్రాంతి పండుగకు ముందే నియోజకవర్గాల నుంచి దరఖాస్తులను భారతీయ జనతా పార్టీ గుట్టుగా అందుకుంది. ప్రత్యేకించి మూడు రోజులపాటు అందరికీ గడువు ఇచ్చి ఆ సమయంలోనే దరఖాస్తు చేసుకోవాలని బీజేపీ షరతు పెట్టింది. ఎవరైతే పదాధికారులు ఉంటారో వారికే దరఖాస్తుల స్వీకరణకు అధికారం ఇచ్చింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో పెద్ద ఎత్తున ప్రతీ నియోజకవర్గం నుంచి దరఖాస్తులు అందడం పార్టీని ఆశ్చర్యంలో ముంచెత్తింది. వాస్తవానికి జనసేన-టీడీపీ ఎన్నికల పొత్తుకు దిగగా ఈ రెండు పార్టీలతోను చివరి క్షణంలో బీజేపీ సయోధ్య కుదుర్చుకునే అవకాశం ఉందని ఆనోటా, ఈనోటా ఇప్పటికే విస్తృతంగా ప్రచారం సాగుతోంది. ఈ ప్రభావం బీజేపీపై పడింది. ఈ కారణంగానే దర ఖాస్తుల సంఖ్య అనూహ్యంగా పెరిగినట్టు చెబుతున్నారు. ఏలూరు నియోజక వర్గంలో సీనియర్లతో పాటు అనేక మంది దరఖాస్తులు చేసుకున్నారు. జిల్లా కేంద్రంతో పాటు బీజేపీకి కాస్త ఊపున్న నియోజక వర్గాల్లోనూ ఆశావహులకు కొదువ లేనట్టుగానే కనిపించింది. ఎవరంతట వారు రాబోయే ఎన్నికల్లో పోటీ చేసేది తామే అన్నట్టుగా అక్కడక్కడ సోషల్ మీడియాలో బాకా ఊదుతున్నారు. వచ్చే ఎన్నికల్లో నియోజక వర్గ స్థాయిలో ఒకవైపు ఆశావహుల దరఖాస్తులు తీసుకుంటూనే ఇంకోవైపు ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా ముఖ్యనేతలతో కమిటీలు వేస్తున్నారు. ఆశావహుల నుంచి వచ్చిన దరఖాస్తుల స్వీకరణ, స్క్రీనింగ్ కోసం జిల్లా కోర్ కమిటీలు త్వరలోనే సమావేశమవుతాయి. ఈ సమావేశంలోనే బలం ఉన్న అభ్యర్థులను ఎంపిక చేసి రాష్ట్ర నాయకత్వానికి నివేదిస్తారు. ఒక్క ఏలూరు జిల్లాలోనే ఆశావహుల నుంచి అందిన దరఖాస్తులు 70కు పైగా ఉన్నట్టు చెబుతున్నారు. ఎంపీ స్థానానికి గారపాటి సీతారామాంజనేయచౌదరి (తపనా చౌదరి) పోటీ చేయనుండడం, ఈ మేరకు ఇప్పటికే ఆయన నియోజకవర్గమంతటా దూసుకుపోతూనే ఉన్నారు. తపనా చౌదరి చొరవతో కొన్ని నియోజకవర్గాల్లో పార్టీకి కాస్తంత ఊపిరొచ్చింది. స్థానిక అవసరాలకు వీలుగా చౌదరి ఆర్థికపరమైన, అక్కడికక్కడే అవసరం తీరేలా మంచినీటి ట్యాంకర్లను ఏర్పాటు చేస్తూ వచ్చారు. ఇవన్నీ బీజేపీకి కొంత కలిసొచ్చినట్టు కనిపిస్తోంది.

యువ ఓటర్లదే హవా !

ఏలూరు సిటీ, జనవరి 24 : జిల్లాలో యువ ఓటర్లే అధికంగా వున్నారు. ఈ నెల 22వ తేదీ విడుదల చేసి తుది ఓటర్ల జాబితా ప్రకారం.. జిల్లా జనాభా 21,77,756 మంది. వీరిలో మహిళలు 11,00,125, పురుషులు 10,77,631 మంది. మొత్తం ఓటర్లు 16,24,416 కాగా వీరిలో 8,30,390 మంది మహిళలు, 7,93,897 మంది పురుషులు ఉన్నారు. వయసు ప్రాతిపదికన చూస్తే 30 నుంచి 39 ఏళ్ల వయసు వారే అధికం. జిల్లాలో ఈసారి యువ ఓటర్లు అధికంగానే నమోదు చేసుకు న్నారు. గతంతో పోలిస్తే ఈసారి 18 నుంచి 19 ఏళ్ల వయస్సు గల కొత్త ఓటర్లు 37 వేల 877 మంది ఉన్నారు. 20 నుంచి 39 ఏళ్ల వయసున్న ఓటర్లు 7,19,071 మంది కావడం విశేషం. యువ ఓటర్లు జిల్లా ఓటర్ల జాబితాలో 50 శాతంపైగానే ఉన్నారు. జిల్లాలో ఏడు నియోజక వర్గాలకు గాను చింతలపూడిలో అత్యధికంగా 2,71,502 మంది ఓటర్లు ఉండగా, అత్యల్పంగా కైకలూరులో 2,04,348 మంది ఓటర్లు ఉన్నారు.

వయసుల వారీగా..

వయసు	ఓటర్ల సంఖ్య
18 నుంచి 19	37,877
20 నుంచి 29	2,83,402
30 నుంచి 39	4,35,669
40 నుంచి 49	3,49,488
50 నుంచి 59	2,63,287
60 నుంచి 69	1,58,796
70 నుంచి 79	72,671
80 పైబడిన..	23,226
మొత్తం	16,24,416

నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం

జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్టు కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఓటు హక్కు ప్రాముఖ్యత, వినియోగం తదితర అంశాలపై కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. యువ ఓటర్లకు గుర్తింపు కార్డులు అందించి, సీనియర్ ఓటర్లు, విభిన్న ప్రతిభావంతులైన ఓటర్లను సన్మానిస్తాం. ప్రజాస్వామ్య విలువలు, ఓటు హక్కు ప్రాముఖ్యత - వినియోగంపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో విజేతలకు బహుమతుల అందజేస్తాం' అని వివరించారు.

నేడు షర్మిల రాక



ఏలూరు కార్పొరేషన్, జనవరి 24 : ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వై.ఎస్. షర్మిల గురువారం ఏలూరులో పర్యటించనున్నట్టు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్‌రావు బుధవారం తెలిపారు. షర్మిలకు భారీ స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు పాత బస్టాండ్ సెంటర్‌కు చేరుకుని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు. అనంతరం ఫ్లయ్ ఓవర్, తంగెళ్ళమూడి మీదుగా ఇండ్రికగూడెం సెంటర్‌లోని సుభీభవ కల్యాణ మండ పానికి చేరుకుని జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో విస్తృత సమావేశం నిర్వహిస్తారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మిథున్ రెడ్డి

30న సీఎం జగన్ రాక

- ఏలూరులో వైసీపీ ఎన్నికల సన్నాహక సమావేశం : ఎంపీ మిథున్‌రెడ్డి

ఏలూరు రూరల్, జనవరి 24 : 'చంద్రబాబు ట్రాప్‌లో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పడింది. చంద్రబాబు రాసిచ్చిన స్క్రిప్టును ఆమె చదువుతోంది' అని ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల వైసీపీ పరిశీలకుడు, ఎంపీ మిథున్‌రెడ్డి విమర్శించారు. ఈ నెల 30న ఏలూరులో సీఎం వైఎస్ జగన్ అధ్యక్షతన జరిగే ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల్లోని పార్టీ ప్రజా ప్రతినిధులు, ముఖ్య నేతలతో ఎన్నికల సన్నాహక సమావేశం జరగనుంది. దీనికి సంబంధించిన ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. జగన్‌ను 16 నెలలు జైలులో, తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేరును చార్జ్‌షీట్‌లో చేర్పిన కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లటం ఆమె విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. వైసీపీ టిక్కెట్ రాని వారికి సహజంగానే అసంతృప్తి ఉంటుందన్నారు. టిక్కెట్లు రాని వారికి జగన్ సముచిత స్థానం ఇస్తారన్నారు. ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యేలు ఆళ్ళ నాని, అబ్బయ్య చౌదరి, పి.వాసుబాబు, మేకా వెంకటప్రతాప్‌అప్పారావు, దూలం నాగేశ్వరరావు, తెల్లం బాలరాజు, చింతలపూడి ఇన్‌చార్జ్ కె.విజయ్‌రాజు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్, జేసీ లావణ్య వేణి, పీవో సూర్యతేజ

జగనన్నకు చెబుదాం స్పందనలో వినతుల స్వీకరణ

జీలుగుమిల్లి, జనవరి 24 : జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో భాగంగా జీలుగుమిల్లి బాలుర ఆశ్రమ పాఠశాల వద్ద బుధవారం మండల స్థాయి స్పందన కార్యక్రమం కలెక్టరు ప్రసన్న వెంకటేశ్ ఆధ్వర్యంలో జరిగింది. మొత్తం 230 అర్జీలు స్వీకరించారు. ఎక్కువ సమస్యలు భూములకు సంబంధించినవి ఉన్నాయి. జీలుగుమిల్లిలో జాతీయ రహదారి నిర్మాణం విషయమై నష్ట పోతున్నట్టు స్థానికుల నుంచి కొన్ని అర్జీలు వచ్చాయని, ఈ విషయమై ఎన్‌హెచ్ రింగ్ రోడ్డుకు సంబంధించి ఎలైన్‌మెంట్ మార్చడం సాధ్యం కాదని, అయినా ఎన్‌హెచ్ ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళతామన్నారు. వంక వారి గూడెంలో ఆయుధ కర్మాగారం ఏర్పాటు వ్యతిరేకిస్తూ గిరిజనులు కొందరు వినతులు అందజేశారు. దీనిపై ఆయన స్పందిస్తూ గిరిజనులంతా గ్రామసభలో ఆమోదం తెలపాల్సి ఉంటుందని, వారి అభిప్రాయం మేరకు మాత్రమే చర్యలు ఉంటాయన్నారు. వారసత్వంగా వచ్చిన భూమిని ఆన్‌లైన్ చేయకుండా తహ సీల్దారు ఏడాదిగా తిప్పుకుంటున్నారంటూ కొత్తచీమలవారిగూడెంకు చెందిన బరగడ వెంకటేశ్వరావు ఫిర్యాదు చేశారు. జడ్పీ ఉన్నత పాఠశాల్లో పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి తహసీల్దారు సుందర్‌సింగ్‌కు పలు సూచనలు చేశారు. జేసీ లావణ్యవేణి, ఐటీడీఏ పీవో సూర్య తేజ పలు శాఖల జిల్లా అధికారులు ఉన్నారు.

స్వచ్ఛ గ్రామాలకు సర్పంచ్‌లు సహకరించాలి

ఏలూరు సిటీ, జనవరి 24 : వినూత్న విధానంలో వ్యర్థాల నిర్వహణ ద్వారా స్వచ్ఛ గ్రామాలను తీర్చిదిద్దేందుకు సర్పంచ్‌లు సహకరించాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ విజ్ఞప్తి చేశారు. కలెక్టరేట్‌లోని గోదా వరి సమావేశ మందిరంలో ఘన వ్యర్థ వనరుల నిర్వహణపై సర్పంచ్‌లు, ఎంపీడీవోలు, డ్వాక్రా సంఘాలు సభ్యులతో బుధవారం ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమాల్లో కలెక్టర్ ఘన వ్యర్థాల నిర్వహణ, స్వచ్ఛ గ్రామాల అంశంపై దిశానిర్దేశం చేశారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ అడ్వైజర్ వి.శ్రీనివాసన్, జడ్పీ సీఈవో కేఎస్ఎస్ సుబ్బారావు, డీపీవో తూతిక శ్రీనివాస విశ్వనాథ్, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ ఏఈ వివేకానంద సస్పెన్షన్

చింతలపూడి, జనవరి 24 : చింతలపూడి గృహ నిర్మాణ శాఖ ఏఈ వివేకానందను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ ఉత్తర్వులు ఇచ్చారు. లబ్ధిదారుల నుంచి కిందిస్థాయి ఉద్యోగుల ద్వారా ఏఈ అవినీతికి పాల్పడ్డారని ఆరోపణలపై కలెక్టర్ స్పందించినట్టు సమాచారం. ప్రభుత్వం ఇళ్లకు మంజూరుచేసిన ఇసుక, సిమెంటు, ఐరన్‌లోను ఏఈ అవినీతికి పాల్పడినట్టు తెలిసింది. కిందిస్థాయి సిబ్బందిపై విచారణ జరుగుతోంది. జగనన్న ఇళ్ల నిర్మాణాలు చేపట్టకుండానే ఆరు వేల 500 సిమెంటు బస్తాలు తేడా ఉన్నట్టు సమాచారం. ఒక కాంట్రాక్టరుకు, డ్వాక్రా మహిళలకు సంబంధించి రూ.25 లక్షలు అడ్వాన్సు పేమెంట్ చేసినట్టు సమాచారం. దీనిపై విచారణ జరుగుతోంది.

27 మంది ఎంపీడీవోల బదిలీ !

ఏలూరు సిటీ, జనవరి 24 : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు గాను అధికారుల బదిలీలకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఉమ్మడి పశ్చిమలో భారీగానే ఎంపీడీవోల బదిలీలు జరిగే అవకాశం ఉంది. ఉమ్మడి పశ్చిమలో 48 మండలాలకు సంబంధించి దాదాపు 27 మంది ఎంపీడీవోలు బదిలీ అయ్యే అవకాశాలున్నాయి. వీటికి సంబంధించి ఒకటి, రెండు రోజుల్లో ఉత్తర్వులు వెలువడనున్నాయి.

ఎన్నికల షెడ్యూల్ వస్తే వైసీపీ ఖాళీ



పార్టీలో చేరిన వారికి కండువా కప్పి స్వాగతిస్తున్న ప్రత్తిపాటి

- టీడీపీ జోన్ 2 ఇన్ చార్జి ప్రత్తిపాటి పుల్లారావు
- 150 మంది వైసీపీ నాయకులు టీడీపీలో చేరిక

తాడేపల్లిగూడెం అర్బన్, జనవరి 24: ఎన్నికల షెడ్యూల్ వచ్చిన వెంటనే వైసీపీ ఖాళీ అయిపోవడం ఖాయమని తెలుగుదేశం పార్టీ జోన్-2 ఇన్‌చార్జి ప్రత్తిపాటి పుల్లారావు ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికలలో తెలుగుదేశం, జనసేన కూటమి విజయం సాధించడం తథ్యమన్నారు. పెంటపాడు మండలం పరిమెళ్ళ నుంచి తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షుడు గంధం సతీష్, టీడీపీ మండల అధ్యక్షుడు కిలపర్తి వెంకట్రావుల ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన 150 మంది నాయకులు, కార్యకర్తలు బుధవారం పట్టణ పార్టీ కార్యాలయం వద్ద పుల్లారావు సమక్షంలో టీడీపీలో చేరారు. ప్రత్తిపాటి మాట్లాడుతూ వైసీపీకి చెందిన ముఖ్య నాయకులు చాలామంది ఆ పార్టీ నుంచి పోటీ చేసేందుకు సిద్ధంగా లేరన్నారు. రానున్న కాలంలో మరింత మంది టీడీపీలో చేరతారన్నారు. మాజీ మంత్రి పీతల సుజాత మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో చేరేందుకు చాలామంది వైసీపీ నాయకులకు రావాలని ఉన్నా స్థానిక మంత్రి కారణంగా భయప డుతున్నారన్నారు. వైసీపీకి అభ్యర్థులు లేరని, స్థానిక మంత్రికి కూడా టిక్కెట్ వస్తుందో లేదో తెలియదన్నారు.

బీసీ గణన పేరిట జగన్ కొత్త నాటకం



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కన్వీనర్ కొల్లు రవీంద్ర

- టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కన్వీనర్ కొల్లు రవీంద్ర

భీమవరం, రూరల్, జనవరి 24 : బీసీలకు ఎటువంటి లబ్ధి చేకూర్చలేని సీఎం జగన్ బీసీ జనగణన పేరుతో మరో కొత్త నాటకం తెరపైకి తెచ్చారని వార్డు వలంటీర్లతో బీసీ కులాల వారి వద్దకు వచ్చి వేలిముద్రలు, ఓటీపీలు చెప్పమని బలవంతం చేయడం వెనుక మోసపూరిత కుట్ర దాగి ఉందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బీసీ సెల్ రాష్ట్ర కన్వీనర్ కొల్లు రవీంద్ర ఆరోపించారు. భీమవరం మండలం దొంగపిండిలో మండల టీడీపీ అధ్యక్షుడు రేవు వెంకన్న అధ్యక్షతన జరిగిన జయహో బీసీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబుతోనే బీసీల అభివృద్ధి జరుగుతుందని రానున్న ఎన్నికలలో చంద్రబాబుని ముఖ్యమంత్రి చేసేలా అన్ని నియోజకవర్గాలలో టీడీపీ-జనసేన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. జిల్లా టీడీపీ అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టాన్ని ఏర్పాటు చేసి బీసీల అభివృద్ధికి కృషి చేస్తారని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ రావు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కర్నేని గౌరునాయుడు, నరసాపురం జనసేన ఇన్‌చార్జి బొమ్మిడి నాయకర్, పెడన టీడీపీ ఇన్‌చార్జి కాగిత కృష్ణమోహన్, జన సేన ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జి జుత్తిగ నాగరాజు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వేంద్ర శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు.

సెర్ప్ ఉద్యోగుల సమ్మెబాట

ఏలూరు రూరల్, జనవరి 24 : అంగన్‌వాడీలు, సమగ్ర శిక్ష, పారిశుధ్య కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఇటీవల సమ్మెబాట పట్టారు. ప్రభుత్వం దిగొచ్చి వారి సమస్యల పరిష్కారానికి అంగీకారం తెలిపింది. ఇప్పుడు డీఆర్‌డీఏ ఆధ్వర్యంలోని వైఎస్సార్ క్రాంతి పథంలో పనిచేస్తున్న సెర్ప్ ఉద్యోగులు సమ్మెబాట పట్టారు. ఇటీవల ప్రభుత్వానికి సమ్మె నోటీసు అందించగా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో సెర్ప్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం నుంచి సమ్మె బాట పట్టినట్టు జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సెర్ప్ ఉద్యోగులు 600 మందికిపైగా ఉన్నారు. వీరు డ్వాక్రా గ్రూపులు ఏర్పాటు, మోనటరింగ్, నవరత్నాల పథకాల అమలు సేవలో నిర్వహిస్తున్నారు. జిల్లాలో 160 మంది విధులు నిర్వహిస్తున్నారు. సీసీ, ఏపీఎం, డీపీఎం, వివిధ కేటగిరిల్లో సేవలందిస్తున్నారు. తమ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం చొరవ చూపడం లేదని, తప్పని పరిస్థితుల్లో సమ్మెబాట పట్టినట్టు నాయకులు స్పష్టం చేశారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వైఎస్సార్ క్రాంతి పథం ఉద్యోగులు

సెర్ప్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం నుంచి ఉద్యోగులు సమ్మెబాట పట్టారు. కలెక్టరేట్ వద్ద దీక్షలు చేపట్టారు. దీక్షా శిబిరాన్ని జేఏసీ చైర్మన్ వి.బాపూజీ ప్రారంభించి మాట్లాడారు. డీఆర్‌డీఏ, వైఎస్సార్ క్రాంతి పథంలో విధులు నిర్వహిస్తున్న తమకు పే స్కేల్‌ను సక్రమంగా నిర్ణయించి క్రమబద్ధీకరించాలని, తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కా రమయ్యే వరకు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. జేఏసీ కన్వీనర్ ఎం.గోపి, కో-కన్వీనర్ శ్రీనివాస్‌గౌస్, హేమంత్, పార్థసారథి, సెర్ప్ ఉద్యోగులు పాల్గొన్నారు.

సెర్ప్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

డిమాండ్లు ఇవి

- పేస్కేల్ అమలు చేసి సర్వీస్ రెగ్యులర్ చేయాలి, సర్వీస్ క్రమబద్ధీకరించాలి.
- ప్రస్తుతం ఉన్న ఈపీఎఫ్ సీలింగ్ విధానాన్ని తొలగించి మూలవేతనంపై నూరుశాతం ఈపీఎఫ్ అమలు చేయాలి.
- ఎంఎస్‌సీలకు హెచ్‌ఆర్ పాలసీ అమలుచేసి పేస్కేల్ వర్తింపజేయాలి.
- సపోర్టింగ్ సిబ్బందికి ఎల్-2,ఎల్-3,ఎల్-4తో కలిసి అన్ని కేడర్‌లకు ఉద్యోగ ఉన్నతులు, ఇంక్రిమెంట్లు ఇవ్వాలి.
- సెర్ప్ హెచ్‌ఆర్ పాలసీ ప్రకారం రూల్ ఆఫ్ రిజర్వేషన్ వర్తింపజేసి అర్హులకు ఉద్యోగ ఉన్నతులు కల్పించాలి.

ఉద్యోగ విరమణ వయస్సు పెంచాలి



ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలి, మరణించిన కుటుంబాలకు కారుణ్య నియామక పథకం అమలు చేసి న్యాయం చేయాలి. ప్రభుత్వ రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా రూ.16 లక్షల గ్రాట్యుటీ అమౌంట్ అమలు చేయాలి. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం హెచ్‌ఆర్‌ఏ ఇవ్వాలి. ప్రభుత్వ సీలింగ్ విధానానికి బదులుగా 100 శాతం బేసిక్ పే పై ఈపీఎఫ్ కంట్రిబ్యూషన్ అమలు చేయాలి.

- బాపూజీ, జేఏసీ చైర్మన్

సేవలకు ఆటంకం



సెర్ప్ ఉద్యోగులు ఆందోళన చేస్తే నవరత్నాలు ఆగే అవకాశం ఉంది. సేవలకు ఆటంకం ఏర్పడు తుంది. సమస్యల పరిష్కారం కోసం 2018లోనూ ఆందోళన చేశాం. అప్పటి ప్రభుత్వం పరిష్కరిస్తా మని హామీ ఇచ్చింది. వైసీపీ ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా పరిష్కరించలేదు.

- విజయ, సీసీ, నూజివీడు

మహాధర్నాకు వెళ్లొద్దు

- యూటీఎఫ్ నాయకులు, మున్సిపల్ టీచర్లకు పోలీసుల నోటీసులు, నిర్బంధం



యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్‌కు నోటీసు అందజేస్తున్న కానిస్టేబుల్

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 24 : మున్సిపల్ టీచర్ల సమస్యల పరి ష్కారానికి గురువారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో విజయవాడలోని మున్సిపల్ డైరెక్టరేట్ వద్ద నిర్వహించతలపెట్టిన మహాధర్నాకు ప్రభుత్వం అనుమతిని అకస్మాత్తుగా నిరాకరించడం, పోలీసు చర్యల కారణంగా వాయిదా వేసినట్టు సంఘ జిల్లా నాయకుడు పీ.వీ.నరసింహారావు వెల్లడించారు. మరోవైపు ధర్నాకు జిల్లా నుంచి ఉపాధ్యాయ సంఘ నాయకులెవరూ వెళ్లకుండా బుధవారమే పలువురికి పోలీసులు ఆయా పాఠశాలలకు వెళ్లి నోటీసులు అందజేశారు. నోటీసులను ధిక్కరించి ధర్నాకు హాజరైతే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ క్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్, జిల్లా కార్యదర్శి శివశంకర్, ఏలూరు నగరశాఖ ప్రధాన కార్యదర్శి రాజారావు తదితరులకు పోలీసులు సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ నోటీసులు అంద జేశారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి రవి కుమార్ మాట్లాడుతూ ధర్నా వాయిదా పడినప్పటికీ సంఘ నాయకుల ఇళ్ల వద్ద పోలీసులు కాపలాగా ఉండి, హౌస్ అరెస్టులు చేయడం విచారకర మన్నారు. ప్రభుత్వ అప్రజాస్వామిక వైఖరిని నిరసిస్తూ గురువారం సాయంత్రం 5గంటలకు అన్ని మునిసిపాలిటీలు, ఏలూరు నగరపాలక సంస్థ వద్ద నిరసన ప్రదర్శనలు జరపాలని నిర్ణయించినట్టు వెల్లడించారు.

గవర్నర్‌ను కలిసిన ఉద్యాన వీసీ


వర్సిటీ రిపోర్టును గవర్నర్‌కు అందజేస్తున్న వీసీ జానకీరామ్

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 24: ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను బుధవారం రాజ్‌భవన్‌లో డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ టి.జానకీరామ్ మర్యాదపూర్వకంగా కలిశారు. వర్సిటీలో చేపట్టిన అభివృద్ధితోపాటు పరిశోధనలను వివరించారు. బి. శ్రీనివాసులు, ఈ. కరుణశ్రీ ఉన్నారు.

ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్ పరీక్షలు

పెదపాడు, జనవరి 24 : జేఈఈ మెయిన్స్ పరీక్షలు మండలంలోని వట్లూరు సర్ సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల, ఏలూరు ఇంజనీరింగ్ కళాశాల, సిద్ధార్థ క్వెస్ట్‌లలో బుధవారం ప్రశాంతంగా జరిగాయి. ఆన్‌లైన్ విధానంలో బ్యాచ్‌లర్ ఆఫ్ ప్లానింగ్, ఆర్కిటెక్చర్ పరీక్షలు జరుగ్గా సీఆర్‌రెడ్డి కళాశాలలో 85 మందికి 76 మంది, ఏలూరు ఇంజనీరింగ్ కళాశాలలో 100 మందికి 93 మంది, సిద్ధార్థ క్వెస్ట్‌లో 180 మందికి 137 మంది హాజరయ్యారు.

నేరుగా టెట్ కం డీఎస్సీ రాతపరీక్ష నిర్వహించండి

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 24 : రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులకు కలిసివచ్చేలా నేరుగా 'టెట్ కం డీఎస్సీ' నిర్వహించాలని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.సుధీర్ బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. బ్యాక్‌లాగ్ పోస్టులను కూడా తాజా నోటిఫికేషన్‌లో చేర్చాలన్నారు. కొత్తగా డీఎడ్, బీఎడ్ పూర్తిచేసిన లక్షలామంది అభ్యర్థులు టెట్‌కోసం ఎదురుచూస్తున్న విషయాన్ని ప్రభుత్వం పరిగణనలోకితీసుకుని వేర్వేరుగా రెండు పరీక్షలు కాకుండా అందరికీ ఒకేసారి టెట్ కం డీఎస్సీ రాతపరీక్షను నిర్వహించడం సబబుగా ఉంటుందన్నారు. ఈ మేరకు సీఎం, విద్యాశాఖ మంత్రికి లేఖలు పంపినట్టు పేర్కొన్నారు.

నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో వివరాల నమోదుకు తుది గడువు 31

ఏలూరు ఎడ్యుకేషన్/భీమవరం ఎడ్యుకేషన్, జనవరి 24 : గతేడాది ఫిబ్రవరిలో జరిగిన ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్) పరీక్షలో జిల్లా నుంచి ఎంపికైన బాలబాలికలు తమ వివరాలను సంబంధిత నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో నమోదు చేసుకునేందుకు ఈ నెల 31వతేదీని తుది గడువుగా కేంద్రం నిర్ణయించిందని డీఈవో శ్యాంసుందర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థి మెరిట్‌కార్డులో నమోదు చేసిన ఆధార్‌కార్డులో పేరు, తదితర వివరాల్లో ఒక్క అక్షరం కూడా తప్పులేకుండా పోర్టల్‌లో సరిపోలినపుడే అప్‌లోడ్ అవుతుందన్నారు. మిస్‌మ్యాచ్ అయితే ఈ నెల 27లోగా డీఈవో కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఇటువంటి దరఖాస్తులన్నింటినీ ఫిబ్రవరి 15లోగా సంబంధిత స్కూలు నోడల్ ఆఫీసర్‌తో పరిశీలింపజేసి స్కూల్ లాగిన్‌లో ధృవీకరిస్తారని వివరించారు. 2019, 2021, 2022 సంవత్సరాల్లో స్కాలర్‌షిప్‌కు ఎంపికై ప్రస్తుతం ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాల/కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు తమ వివరాలను పోర్టల్‌లో రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. అప్పుడు మాత్రమే ఉపకారవేతనం మంజూరవుతుందని స్పష్టంచేశారు. నిర్ణీత గడువులోగా ఈప్రక్రియను పూర్తిచేయకపోతే తల్లిదండ్రులు, హెచ్ఎంలదే బాధ్యతని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదోతరగతి చదువుతున్న విద్యార్థులకు కేంద్రం నిర్వహించే పరీక్షలో ఎంపికైనవారికి తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు వరుసగా నాలుగేళ్లపాటు ఏడాదికి రూ.12 వేలు చొప్పున విద్యార్థి బ్యాంకు ఖాతాకు జమచేస్తారు.

ఓపెన్ స్కూల్‌లో తత్కాల్ ప్రవేశాలకు..

భీమవరం ఎడ్యుకేషన్, జనవరి 24: ఓపెన్ స్కూల్‌లో 10వ తరగతి, ఇంటర్ 2023-24 విద్యా సంవత్సరంలో చేరుటకు తత్కాల్ ప్రవేశములు ఈనెల 31 వరకు గడువు గలదని, ఆసక్తి గల విద్యార్థులు ఏఐ సెంటర్స్ ద్వారా ప్రవేశాలు పొందవచ్చని డీఈవో ఆర్. వెంకటరమణ తెలిపారు. పీఎస్ఎం బాలికోన్నత పాఠశాలలో ఏపీఓఎస్ఎస్ ఏఐ సెంటర్స్ కోఆర్డినేటర్స్ సమీక్షా సమావేశం బుధవారం నిర్వహించారు. డీఈవో మాట్లాడుతూ, ఈ ఏడాది మార్చిలో జరిగే పబ్లిక్ పరీక్షల్లో హాజరయ్యే విద్యార్థుల వివరాలు, ఎస్ఆర్ఎస్ తప్పులు లేకుండా సరిచేయాలని, పరీక్షల తదుపరి కరెక్షన్స్ చేయబడవన్నారు. పీసీపీ క్లాసులు తప్పనిసరిగా నిర్వహించాలని, ఉపాధ్యాయులు హాజరు యాప్ తప్పక నమోదు చేయాలన్నారు. పీహెచ్‌సీ విద్యార్థులు సర్టిఫికెట్స్ వెంటనే సమర్పించాలని లేని యెడల రాయితీలు ఇవ్వబడవన్నారు. స్టేట్ కోఆర్డినేటర్ శివకోటేశ్వరరావు, ఏఐ కోఆర్డినేటర్స్ ఉన్నారు.

పాఠశాల భవనాలు డీఈవో పరిశీలన


రికార్డులు పరిశీలిస్తున్న డీఈవో వెంకటరమణ

వీరవాసరం, జనవరి 24: మండలంలో తోలేరు శివారు పడమటిపాలెం, చింతలకోటిగరువు శివారు నడపనవారిపాలెంలో నూతనంగా నిర్మిస్తున్న పాఠశాల భవనాలను డీఈవో ఆర్. వెంకటరమణ బుధవారం పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న ఆయా పాఠశాల భవనాలను పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాలమేరకు పరిశీలించి, మంజూరైన నిధులు తదితర వివరాలను తెలుసుకున్నారు. నిధుల విడుదలకు చర్యలు తీసుకుంటామన్నారు. వీరవల్లి దుర్గాభవాని చంద్రశేఖర్, వేంద్ర లీలాకృష్ణ, శ్యాంసుందర్, రాజేష్, శ్రీమన్నారాయణ, స్వామినాయుడు పాల్గొన్నారు.

రాయకుదురు జడ్పీ హైస్కూల్ తనిఖీ

రాయకుదురు జడ్పీహైస్కూల్‌ను డీఈవో తనిఖీ చేశారు. పది విద్యార్థుల విద్యాబోధన, నూరుశాతం ఉత్తీర్ణతకు అనుసరించాల్సిన కార్యాచరణపై హెచ్ఎం, ఉపాధ్యాయులతో సమీక్షించారు. చదువులో వెనుకబడిన సీ, డీ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. రికార్డులను తనిఖీ చేశారు. హెచ్ఎం కానుకొలను శ్రీనివాసరావు, ఎంఈవో-2 శ్రీమన్నారాయణ ఉన్నారు.

అలరించిన సినీ మ్యూజికల్ నైట్



సినీ గీతాలను ఆలపిస్తున్న గాయకులు

భీమవరంటౌన్, జనవరి 24 : మావుళ్ళమ్మ ఉత్సవాల్లో భాగంగా బుధవారం కొటికలపూడి గోవిందరావు కళావేదికపై తణుకుకు చెందిన రాజు ఆర్కెస్ట్రా, ఈవెంట్స్ నిర్వహించిన సినీ మ్యూజికల్ నైట్ ఆకట్టుకుంది. పలు చిత్రాల్లోని పాటను గాయకులు ఆలపించి ప్రేక్షకులను అలరించారు. అనంతరం కళాకారులను సత్కరించారు. రాత్రి 8-30 కు మావుళ్ళమ్మ నాట్యమండలి వారిచే శ్రీకృష్ణ తులాభారం నాటకం ప్రదర్శించారు. తొలుత బోడపాడుకు చెందిన బాలమురళీకృష్ణ భక్త సమాజం భజన, ఉరదాల పాలెంకు చెందిన జగన్నాధపు వెంకటేశ్వరరావుచే భగవత్ పారాయణ, కొవ్వూరు దనుకొండ లిఖిత బృదంచే కూచిపూడి నృత్యప్రదర్శన జరిగింది. గురువారం హరే శ్రీనివాస, భీమవరం భజన మండలి ఆధ్వర్యంలో కోలాటం. నడింపల్లి రాజగోపాల రాజు(నరసాపురం)వారిచే ఆధ్యాత్మిక ప్రవచనం, జగన్నాధపు వెంకటేశ్వరరావు (ఉరదాలపాలెం) వారిచే భగవద్గీత పారాయణం, స్వరతరంగిణీ(భీమవరం)వారిచే సినీమ్యూజికల్ నైట్, లింగాల సాయిబాబా సమర్పణలో మూడు రత్నాల నాటకం ప్రదర్శనలు ఉంటాయని నిర్వాహకులు వివరించారు.

రైతులకు పరిహారం తక్షణం విడుదల చేయాలి

చాట్రాయి, జనవరి 24: మిచౌంగ్ తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే పరిహారం విడుదల చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేణుగోపాలరెడ్డి, మండల కార్యదర్శి రావూరి వెంకట పిచ్చేశ్వర రావు డిమాండ్ చేశారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ నష్టపోయిన రైతుల జాబితాలు ఆర్బీకేల ద్వారా ప్రభుత్వానికి పంపి నెల రోజులు కావస్తున్నా స్పందించకపోవటం శోచనీయమన్నారు. ఎకరాకు రూ. 20 వేలు చొప్పున పెట్టుబడి రాయితీ తక్షణం విడుదల చేసి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మేపాళచెట్టు కాయలు తిన్న 8 మంది చిన్నారులకు అస్వస్థత

- ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స.. ఆందోళన వద్దన్న వైద్యులు
- పూర్తిస్థాయిలో కోలుకుంటారని తల్లిదండ్రులకు భరోసా
- బేరన్ పొగాకు పనులకు గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచి వచ్చిన వలస కూలీలు


ఏలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు


జంగారెడ్డిగూడెంలో..

ఏలూరు క్రైం/జంగారెడ్డిగూడెం, జనవరి 24 : బేరన్ పొగాకు పనులకు వచ్చిన వలస కూలీల పిల్లలు మేపాళచెట్టు కాయలు తిని తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పిల్లల ప్రత్యేక వైద్య బృందం వారిని పరీక్షించి ఎలాంటి ప్రాణాపాయం లేదని, మగతగా ఉన్నారని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పూర్తిస్థాయిలో కోలుకుంటారని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు ఊపిరిపీల్చుకున్నారు.

వివరాల్లోకి వెళ్తే.. గుంటూరు, పల్నాడు జిల్లాలకు చెందిన 22 మంది వలస కూలీలు నల్లజర్ల మండలం పోతవరంలో బేరన్ పొగాకు కొట్టే పనుల కోసం 12 రోజుల క్రితం వచ్చారు. వారితో పాటు 11 మంది పిల్లలు కూడా ఉన్నారు. పెద్దవారంతా ఉదయాన్నే పొగాకు కొట్టే పనులకు వెళ్లి మధ్యాహ్నం ఒంటి గంటకు వస్తారు. భోజనం అనంతరం తిరిగి పొగాకు కొట్టడానికి వెళ్తారు. యథావిధిగా బుధవారం వారంతా పొలం పనులకు వెళ్లగా పిల్లలు ఇళ్ల వద్ద ఉన్నారు. వారి మకాం సమీపంలో మేపాళ చెట్లు ఉండడంతో వాటికి ఉన్న కాయలు కోసుకుని ఎనిమిదిమంది పిల్లలు తిన్నారు. వారికి వాంతులొతుండ డంతో ఒంటిగంటకు వచ్చిన తల్లిదండ్రులు గమనించి వెంటనే కొయ్యలగూడెం ప్రభుత్వాసుపత్రికి, అక్కడ నుంచి జంగారెడ్డిగూడెం.. రాత్రి 8.30 గంటలకు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు.

ప్రభుత్వాసుపత్రి ఆర్ఎంవో ప్రసాదరెడ్డి, చిన్నపిల్లల వైద్య చికిత్స విభాగం హెచ్ఓడీ డాక్టర్ ఎ.దీపక్‌కుమార్ బృందం కలిసి పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అప్పటి వరకూ తమ పిల్లల పరిస్థితిపై ఆందోళన చెందు తున్న తల్లిదండ్రులకు ఆ వైద్య బృందం.. పిల్లలు మగతా ఉన్నారని ఎటు వంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆత్మస్థైర్యం కల్పించడంతో వారు తమ దేవుళ్లకు దండాలు పెట్టుకున్నారు. ప్రస్తుతం ఆసుపత్రిలో వారు చికిత్స పొందుతున్నారు. పల్నాడు జిల్లా పిడుగురాళ్ళకు చెందిన మాడా రిషికుమార్ (5), మందా అజయ్ (6), మాచవరం గ్రామ పరిధిలోని మల్లవోలుకు చెందిన ఏపూరి భవ్య (5), ఏపూరి స్వీటీ (3), కోసూరు మండలం నాగవరానికి చెందిన వడ్లమూడి ప్రశాంత్ (7), వడ్లమూడి ప్రసన్న (5), వడ్లమూడి చిన్ని (3), గుంటూరు జిల్లా పిల్లుట్లకు చెందిన చేడపొంగు ఆనందబాబు (6) ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు.

నాటు తుపాకులు స్వాధీనం చేసుకోండి : ఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు క్రైం, జనవరి 24 : ఏజెన్సీ, కొల్లేరు ప్రాంతాల పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న నాటు తుపాకులను స్వాధీనం చేసుకోవాలని ఎస్పీ డి. మేరీ ప్రశాంతి ఆదేశాలు జారీ చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో డీఎస్పీ, సీఐ, ఎస్ఐలతో నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో నిరంతరం వాహన తనిఖీలు నిర్వహించాలన్నారు. ఎన్నికల కోడ్ నిబంధనలు అనుసరించి ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. తప్పిపోయిన బాలికల కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలన్నారు. ప్రశాంతత, శాంతి భద్రతల పరిరక్షణ కోసం సమిష్టంగా విధులు నిర్వహించాలన్నారు. ప్రజలు తమ ఓటు హక్కును నిర్భంగా నిర్వహించుకునేలా చూడాలన్నారు. క్షేత్రస్థాయిలో సమాచార వ్యవస్థను మెరుగు పర్చుకోవాలన్నారు. సమస్యలు సృష్టించే వ్యక్తులను బైండోవర్ చేయాలని ఆదేశించారు. గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాల న్నారు. తుపాకుల లైసెన్సులను పరిశీలించాలన్నారు. మద్యం, గంజాయి, నాటు సారా అక్రమ రవాణా నియంత్రించడానికి కార్డన్ చర్చి నిర్వహించాలన్నారు. అదనపు ఎస్పీ భాస్కర రావు, ఎస్ఐబి అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.


అధికారులతో చర్చిస్తున్న క్రీడాకారులు

రిజిస్టర్ కాకుండా ఎలా ఆడతారు..

- వేములదీవి క్రికెట్ జట్టు అభ్యంతరం.. జిల్లాస్థాయికి ఎంపిక

నరసాపురం టౌన్, జనవరి 24: అధికారులు, సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఆడుదాం ఆంధ్రా పోటీల్లో క్రీడాకారుల మధ్య విభేదాలు నెలకొన్నాయి. వైఎన్ కళాశాలలో బుధవారం జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో రిజిస్టర్ చేసుకోని క్రీడాకారులు బరిలో దిగడంతో అప్పటి వరకు విజేతలుగా నిలిచిన వేములదీవి క్రికెట్ జట్టు అభ్యంతరం తెలిపింది. ఇరుజట్ల మధ్య వివాదం చోటు చేసుకుంది. వివరాల్లో వెళ్లితే..... ఇప్పటి వరకు జరిగిన పోటీలో వేములదీవి క్రికెట్ జట్టు దూసుకుపోతూ వచ్చింది. నరసాపురం అర్బన్ జట్టుతో ఫైనల్ మ్యాచ్ బుధవారం ఆడాల్సి ఉంది. అయితే టీమ్‌లోని క్రీడాకారులు రిజిస్టర్ కాకుండా బయట వ్యక్తుల చేత ఆడించడాన్ని వేములదీవి క్రీడాకారులు అభ్యంతరం తెలిపారు. దీంతో ఇరు జట్ల క్రీడాకారులు వాగ్వాదానికి దిగారు. రిజిస్టర్ కాని క్రీడాకారులతో ఎలా ఆడిస్తారంటూ మునిసిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది వేములదీవి క్రీడాకారులను నిలదీశారు.ఆర్డీవో అంబరీష్, కమిషనర్ వెంకటేశ్వరావు జోక్యం చేసుకుని ఇరుజట్లు రిజిస్టర్ చేయించుకున్నారా లేదా అన్నది పరిశీలించారు. నరసాపురం అర్బన్ టీమ్ క్రీడాకారుల్లో కొందరు రిజిస్టర్ కాలేదని గుర్తించి వేములదీవి ఈస్ట్ జట్టును విజేతగా ప్రకటించారు. దీంతో జిల్లాస్థాయికి వేములదీవి క్రికెట్ జట్టు ఎంపికైనట్లుయింది.

31,1న కలెక్టరేట్‌ల ఎదుట ఏపీటీఎఫ్ ధర్నా

తణుకు, జనవరి 24: మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఏపీటీఎఫ్ పక్షాన ఈనెల 31న, ఫిబ్రవరి 1న కలెక్టరేట్‌ల ఎదుట ధర్నా నిర్వహి స్తున్నట్టు సమాఖ్య రాష్ట్ర పూర్వ కార్యదర్శి ఐ.రాజగోపాల్ తెలిపారు. బుధవారం తణుకు మున్సిపల్ పాఠశాలలను సందర్శించి పాఠశాల వద్ద నిరసన తెలిపారు. సమాఖ్య నాయకులు సుబ్బారావు, అంజిబాబు, హరికృష్ణ, సుజాత పాల్గొన్నారు.

ఎస్ఆర్‌కేఆర్‌లో ముగిసిన చెస్ శిక్షణా శిబిరం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మురళీకృష్ణంరాజు

భీమవరం ఎడ్యుకేషన్, జనవరి 24 : ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న జేఎన్‌టీయూ కే చెస్ సౌత్‌జోన్ టీమ్ శిక్షణ శిబిరం బుధవారంతో ముగిసింది. ఈనెల 26 నుంచి 29 వరకు తిరుచు నాపల్లిలోని భారతీ దాసన్ యూనివర్సిటీలో జరిగే పోటీలకు బుధవారం క్రీడాకారులు బయలుదేరి వెళ్లారు. సౌత్‌జోన్ పోటీలలో విజయం సాధించి మంచి పేరు తీసుకురావాలని ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీ కృష్ణంరాజు అన్నారు. విజయవాడ ఎస్ఆర్ఐ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి బి.జే.ఎస్.కె. రణధీర్, సూరంపూడి ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి నాగదిలీప్, ఎస్ఆర్‌కెఆర్‌కు చెందిన ఎస్.ఎల్.డి. విజయ్, పి.ఎస్.ఆర్. కార్తీక్, ఏలూరు రామచంద్రకు చెందిన సిహెచ్.ఆదిత్యకృష్ణసాయి, అమలా పురం శ్రీనివాస్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన కె.గౌతమ్‌ధర్మ శిక్షణ పొంది నట్టు ఫిజికల్ డైరెక్టర్ పి. సత్యనారాయణరాజు వివరించారు. అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్స్ సిహెచ్. హరిమోహన్, జి. సారిక, అవినాష్ ఉన్నారు.

చెన్నై, చండీఘడ్ పోటీలకు వెయిట్‌లిఫ్టర్ల ఎంపిక

ఏలూరు స్పోర్ట్స్, జనవరి 24: చెన్నైలో ఈనెల 26 నుంచి 30 వరకు జరిగే యూత్ నేషనల్ ఖేలో ఇండియా వెయిట్‌లిఫ్టింగ్ పోటీలకు, చండీఘడ్‌లో ఈనెల 26 నుంచి 29 వరకు జరిగే అఖిలభారత అంతర్‌విశ్వవిద్యాలయ పోటీలకు ఏలూరు జిల్లా వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న వెయిట్‌లిఫ్టర్లను ఎంపిక చేసినట్లు అసోసియేషన్ కార్యదర్శి కె.సర్వేశ్వరరావు బుధవారకం ఒక ప్రకటనలో తెలిపారు. ఎ.అరుణేష్‌బాబు, బి.ప్రేమ్‌సాగర్, ఆర్.భవానీ, ఎ.రేవతి ఖేలో ఇండియా యూత్‌గేమ్‌కు, టి.మధుబాబు, ఈ.కోటేశ్వరరావు, కుమారస్వామి, కోమల్‌కార్తీక్, ఎస్.వి సత్య నారాయణ, వి.ప్రశాంత్, డి.మౌలాలీ అంతర్ విశ్వవిద్యాలయ పోటీలకు ఎంపిక చేసినట్లు వివరించారు. ఖేలో ఇండియాపోటీలకు ఎం.రమేష్‌బాబు, వి.సందీప్ కోచ్‌లుగా, రమేష్‌బాబు, సందీప్, టి.దీన్‌బాబు మేనేజరుగా వ్యవహరిస్తారు. అఖిలభారత విశ్వవిద్యాలయ పోటీలకు ఎ.శ్రీనివాసరావు కోచ్‌గా మేనేజర్లుగా టి.టి.వి.ఎల్ శ్రీకర్ వ్యవహరిస్తారు.

ఆవును చంపిన పులి

- ఎర్రాయిగూడెం-మంగదేవిపేట ప్రాంతాల్లో సంచారం
- భయాందోళనల్లో మన్యం బిడ్డలు



పులి దాడిలో మరణించిన ఆవు, పరిశీలిస్తున్న అటవీశాఖ, వైల్డ్‌లైఫ్ అధికారులు



పులి పాదముద్ర, ఏర్పాటు చేస్తున్న ట్రాప్ కెమెరా

బుట్టాయగూడెం/కొయ్యలగూడెం, జనవరి 24: మండలంలోని ముంజులూరు గ్రామ పరిధిలోని చింతమొక్కబాట వద్ద సోమవారం పులి, ఆవును చంపి తిన్న ఘటన ఆలస్యంగా వెలుగుచూడటంతో మన్యం బిడ్డలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. మన్యంలో పులి సంచారం నిజం కావడంతో ఇళ్ల నుంచి బయటకు రావడానికి వణికిపోతున్నారు. ఏసమయంలో ఎటునుంచి వచ్చి తమపై దాడిచేస్తుందోనని గగ్గోలు పెడుతున్నారు. అటవీ ప్రాంతంలో కొండరెడ్లు ప్రాణాలను అరచేతపట్టుకుని కాలం గడుపుతున్నారు. అడ్డమడుగు గుంపునకు చెందిన కొండరెడ్ల ఆవుగా అటవీశాఖ, వైల్డ్‌లైఫ్ అధికారులు గుర్తించారు. సమాచారం తెలుసుకున్న కన్నాపురం అటవీశాఖ అధికారి కె.కృష్ణకుమారి, వైల్డ్‌లైఫ్ డీఆర్‌వో జె.ప్రభాకర్, ఎఫ్ఎస్‌వో మూర్తి సిబ్బందితో కలిసి బుధవారం ఘటనా స్థలాన్ని పరిశీలించి పులి పాదముద్రలను సేకరించారు. ఆవు మృతదేహం వద్దకు పులి మరోసారి వచ్చే అవకాశం ఉన్నందున దాని జాడ కనుగొనడానికి ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు వైల్డ్‌లైఫ్ డీఆర్‌వో ప్రభాకర్ తెలిపారు. ఆవును చంపింది పెద్దపులేనని అధికారులు స్పష్టం చేస్తున్నారు. నమూనాలను ల్యాబ్‌కు పంపుతున్నట్లు తెలిపారు. కామయ్యకుంట మీదుగా లంకపల్లి అటవీ ప్రాంతం గుండా అభయారణ్యంలోకి వెళ్లినట్లు అధికారులు చెబుతున్నారు. పులిని పట్టుకునేందుకు మరిన్ని ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. అటవీ ప్రాంతాల్లో కొండరెడ్లు ఒంటరిగా అడవిలోకి వెళ్లొద్దని సూచించారు. పశువుల కాపరులు పెద్దపెద్ద శబ్దాలు చేస్తుండాలన్నారు.

ఇదిలా ఉండగా, పశ్చిమ ఏజెన్సీలో పెద్దపులి సంచరిస్తున్నట్లు వారం రోజులుగా మన్యంవాసులు గగ్గోలు పెడుతున్నా అవన్నీ పుకార్లేనంటూ అటవీశాఖ అధికారులు కొట్టిపారేశారు. పులి పాదముద్రలు గుర్తించి సమాచారం ఇచ్చినా అవి అడవి పిల్లివని అని నిర్ధారించేశారు. ఎర్రాయిగూడెం-మంగదేవిపేట పరిసర ప్రాంతాల్లో పులి జాడను గ్రామస్థులు గుర్తించి అధికారులకు సమాచారమిచ్చినా పులి కాదన్నారు. గెడ్డపల్లి, చింతపల్లి, ముంజులూరు,రెడ్డికోపల్లె, ఎర్రాయిగూడెం, మంగదేవిపేట ప్రాంతాల్లో సంచరించినట్లు గిరిజనులు చెబుతున్నారు. ఇటీవల గెడ్డపల్లిలో ఆవు దూడను లాక్కుపోగా రెడ్డికోపల్లె ప్రాంతంలో మేకపై దాడి చేసినట్టు తెలిపారు.

దిప్పకాయలపాడు పొలాల్లో పులిజాడలు..

కొయ్యలగూడెం మండలంలో పెద్దపులి సంచారం కనపడింది. బయ్యన్నగూడెం పొలాల్లో జాడలు కనిపించటంతో రైతులు భయందోళనకు గురయ్యారు. బుట్టాయిగూడెం మండలం నుంచి యర్రాయిగూడెం, దిప్పకాయలపాడు మీదుగా కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం మండలం కేతవరం వైపునకు వెళ్లినట్లు అడుగుజాడలను బట్టి చెబుతున్నారు. ఫారెస్ట్ అధికారులు ప్రత్యేక నిఘా పెట్టారు.

వేల్పూరు పంచాయతీ నిధులు గోల్‌మాల్!

- కార్యదర్శి సొంత అకౌంట్‌లోకి రూ.17,90,000
- అధికారులు తగు చర్యలు చేపట్టాలి : సర్పంచ్


మాట్లాడుతున్న సర్పంచ్ కృష్ణవేణి

ఇరగవరం, జనవరి 24 : పంచాయతీ నిధులు దుర్వినియోగంకు పాల్పడిన పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని వేల్పూరు సర్పంచ్ విశ్వనాధం కృష్ణవేణి అన్నారు. వేల్పూరు గ్రామంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. వేల్పూరు గ్రామానికి చెందిన పంచాయతీ కార్యదర్శి గంగాధరరావు, 15వ ఆర్థిక సంఘం నిధులు సర్పంచ్ ప్రమేయం లేకుండా రూ. 17,90,000 తన ఖాతీలోకి మళ్లించుకున్నాడు. ఈ విషయంపై సర్పంచ్ విశ్వనాధం కృష్ణవేణి, వార్డు సభ్యులు కార్యదర్శిని వివరణ అడిగితే పొంతన లేని సమాధానం చెబుతూ చివరకు తన అకౌంట్‌లో ఉందని ఒప్పుకున్నాడు. దీనిపై తక్షణమే సంబంధిత అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని సర్పంచ్‌డిమాండ్ చేశారు.

ప్రతి జిల్లా కేంద్రంలో హ్యాండీ క్రాఫ్ట్ బజార్

నూజివీడు, జనవరి 24: చేతివృత్తిదారుల సంక్షేమానికి ప్రతి జిల్లా కేంద్రంలో వైఎస్సార్ హ్యాండీ క్రాఫ్ట్ బజార్ల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు హ్యాండీ క్రాఫ్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ బడిగించల జయలక్ష్మి అన్నారు. నూజివీడు పట్టణంలో వీణల తయారీ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. దాదాపు 17 జాతీయ, అంతర్జాతీయ అవార్డులు అందుకున్న వీణల తయారీదారు షేక్ మాబును సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి జిల్లా కేంద్రంలో వైఎస్సార్ హ్యాండీక్రాఫ్ట్ బజారులను ఏర్పాటు చేసేందుకు స్థలాలను సేకరిస్తున్నామన్నారు. కళాకారులైన మహిళలతో స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. వీణల తయారీకి శిక్షణ ఇచ్చేందుకు ముందుకు వచ్చిన మాబూకు భూమిని మంజూరు చేసేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానన్నారు.

క్రైం కార్నర్


పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న సంఘాల నేతలు

కనకదుర్గమ్మ పీఠాన్ని ధ్వంసం చేసిన దుండగులను అరెస్ట్ చేయండి

- పోలీస్ స్టేషన్ ఎదుట హిందూ సంఘాల ఆందోళన

ద్వారకాతిరుమల, జనవరి 24: హిందూ ఆధ్యాత్మిక కేంద్రాన్ని వాణిజ్య కేంద్రంగా మార్చాలన్న డిమాండ్‌ను కాదన్నందుకు ఆలయ పీఠాన్ని ధ్వంసం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని హిందూ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బాధితులు పోలీస్ స్టేషన్ వద్ద బుధవారం ఆందోళన నిర్వహించారు. తమవెనుక గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, హోం మంత్రి ఉన్నారని, తమను ఎవరూ ఏమీ చేయలేరంటూ బెదిరిస్తున్నట్లు వాపోయారు. తొలుత హిందూ సంఘాల ఐక్యవేదిక నేతలు, స్థానికులతో కలసి తిమ్మాపురం శివారులో ధ్వంసానికి గురైన కనకదుర్గమ్మ పీఠాన్ని పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకుని కనకదుర్గమ్మ పీఠాన్ని ధ్వంసం చేసిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులను నమోదు చేయడంతో పాటు వారిని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. భీమడోలు సీఐ రవికుమార్ ఘటనా స్థలానికి చేరుకుని చర్చలు జరుపగా తాత్కాలికంగా ఆందోళన విరమించారు.

ఆక్వా చెరువులో పడి యువకుడి మృతి

కాళ్ళ, జనవరి 24 : ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం జువ్వలపాలెంలో చోటు చేసుకుంది. వివరాలివి. కొవ్వూరుకు చెందిన వడ్లమూడి వెంకటరాజు (37) అనే యువకుడు మద్యానికి బానిసయ్యాడు. కొద్ది రోజుల క్రితం జువ్వలపాలెం వచ్చాడు. అతిగా మద్యం తాగి ఆక్వా చెరువులో ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి గంగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వీరభద్రరావు తెలిపారు.

ఏసీబీ అధికారులకు చిక్కిన రైటర్, ఏఎస్ఐ

- 41(ఏ) నోటీసు ఇవ్వడానికి లంచం డిమాండ్
- రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన వైనం


పోలీసుల అదుపులో ఏఎస్ఐ వెంకన్నబాబు, స్టేషన్ రైటర్ రమణ

ఏలూరు క్రైం, జనవరి 24 : మద్యం బాటిళ్లతో పట్టుబడిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసి ఆపై సీఆర్పీసీ 41(ఎ) నోటీసు ఇవ్వడానికి లంచం తీసుకుంటున్న ఏలూరు రూరల్ స్టేషన్ రైటర్ డి.వి.రమణ, ఏఎస్ఐ వెంకన్నబాబును ఏసీబీ అధికారులు బుధవారం రాత్రి స్టేషన్ వద్ద రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ ప్రతాప్ కుమార్ వివరాల ప్రకారం.. రూరల్ మండలం ప్రత్తికోళ్లలంకకు చెందిన సైదు రామ్‌కుమార్ వద్ద ఆరు మద్యం బాటిళ్లు ఉండడంతో అతడిని పోలీసులు ఈనెల 12న అదుపులోకి తీసుకుని క్రైం నెంబర్ 17/2024గా కేసు నమోదు చేశారు. అయితే అతడికి సీఆర్పీసీ 41(ఎ) కింద నోటీసు ఇవ్వడానికి రూ.10 వేలు లంచం రైటర్ డిమాండ్ చేశాడు. చివరకు ఎనిమిది వేలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. లంచం ఇవ్వడానికి ఇష్టంలేని రామ్‌కుమార్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ డీఎస్పీ ప్రతాప్‌కుమార్, ఇన్‌స్పెక్టర్లు బాస్కరరావు, కె. నాగేంద్ర ప్రసాద్ సిబ్బందితో కలిసి బుధవారం రాత్రి ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద నిఘా పెట్టారు. స్టేషన్‌లో సీసీ కెమెరాలు ఉండడంతో రామ్‌కుమార్‌ను స్టేషన్ ఎదురుగా ఉన్న ఎమ్మార్వో ఆఫీస్ వద్దకు తీసుకువెళ్లి లంచం తీసుకున్నాడు. అదే సమయంలో ఏఎస్ఐ కె.వెంకటేశ్వరరావు (వెంకన్నబాబు) ఆ కేసు దర్యాప్తు తానే చేస్తున్నానంటూ వెయ్యి రూపాయలు ఫోన్‌పే చేయించుకున్నాడు. ఏసీబీ అధికారులు వారిద్దరిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అదే సమయంలో స్టేషన్ రైటర్ రమణ, ఏసీబీ అధికారులతో వాగ్వాదానికి దిగాడు. వెంటనే కస్టడీలోకి తీసుకుని స్టేషన్‌లో కూర్చోబెట్టారు. అనంతరం సీసీ పుటేజ్‌లను పరిశీలించారు. వారిద్దరిపై కేసు నమోదు చేసి లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. వారిద్దరిని అరెస్టు చేశారు. విజయవాడలో ఉన్న ఏసీబీ కోర్టులో గురువారం హాజరుపర్చనున్నారు.

మహిళపై దాడి.. ఇద్దరి అరెస్టు

భీమడోలు, జనవరి 24 : కారు డ్రైవింగ్ నేర్చుకునేందుకు వెళ్తున్న మహిళపై దాడి చేసిన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలివి. ఈ నెల 23న భీమడోలు ఇందిరా కాలనీకి చెందిన కాసం యామిని కారు డ్రైవింగ్ నేర్చుకోవడానికి విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో ఖాళీ ప్లాట్లలోకి డ్రైవర్‌ను తీసుకువెళ్లారు. అక్కడే ఉన్న భీమడోలుకు చెందిన మద్దా కల్యాణ్, నూకల ప్రవీణ్‌కుమార్ వీరిపై దాడి చేసి సొమ్ము లాక్కుని పరారయ్యారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులిద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

హోటల్ యజమాని అరెస్ట్

భీమడోలు, జనవరి 24 : నిబంధనలకు విరుద్ధంగా గ్యాస్ సిలెండర్లను వినియోగిస్తున్న హోటల్ యజమానిని పోలీసులు అరెస్టు చేసినట్లు సివిల్‌సప్లై డిప్యూటీ తహసిల్దార్ మాధవరావు తెలిపారు. స్థానిక శ్రీవిజయభవానీ హోటల్‌లో బుధవారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. గృహ వినియోగానికి ఉపయోగించే ఐదు సిలెండర్లను స్వాధీనపర్చుకుని కేసు నమోదుచేశారు. సీఐ విల్సన్ పాల్గొన్నారు.

ఏడోరోజూ సెల్‌టవర్‌పైనే..

భీమవరం క్రైం, జనవరి 24 : తనకు రావల్సిన జనరల్ యాక్సిడెంట్ ఇన్సురెన్స్ పత్రాలు ఇవ్వడం లేదంటూ గత ఏడు రోజులుగా లోకం ఏసు అనే వ్యక్తి సెల్‌టవర్‌పైనే ఉన్నాడు. గురువారం ఎక్కిన వ్యక్తి బుధవారం కూడా దిగలేదు. పోలీసు, రెవెన్యూ, ఫైర్ అధికారులు అక్కడే ఉన్నారు.


జయహో బీసీ సదస్సులో మాట్లాడుతున్న గన్ని వీరాంజనేయులు

బీసీల సంక్షేమమే తెలుగుదేశం పార్టీ లక్ష్యం : గన్ని

లింగపాలెం, జనవరి 24: బీసీల సంక్షేమమే టీడీపీ లక్ష్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు అన్నారు. బోగోలులో టీడీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు తాళం సోంబాబు, పార్టీ మండల అధ్యక్షుడు గరిమెళ్ళ చలపతిరావు ఆధ్వర్యంలో బుధవారం జరిగిన జయహో బీసీ కార్యక్రమంలో గన్ని ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీకి బీసీలే వెన్నుముక అన్నారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించింది తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు అన్నారు. జగన్ రెడ్డి బీసీలకు అనేక కార్పొరేషన్లు పెట్టి ఒక్కపైసా కూడా విదల్చలేదని, పేరుకే నా బీసీలు అంటూ బీసీలను తొక్కిపట్టాడని అన్నారు. తెలుగుదేశం, జనసేనల ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ, బొంతు శేషగిరి, ముత్తారెడ్డి, కూరపాటి వెంకటేశ్వరరావు, గుత్తా సత్యసాయివరప్రసాద్, మునునూరి రాము, చెన్ను శ్రీనివాస్ యాదవ్, మోరంపూడి మల్లికార్జున్‌రావు, కూరపాటి రత్తయ్య, పిల్లల శ్రీనివాస్‌యాదవ్, చెన్ను శ్రీనివాస్‌యాదవ్, దాసరి శ్యామ్‌చంద్రశేషు, తదితరులు పాల్గొన్నారు.

పోలవరంలో..


టీడీపీలో చేరిన యువత, మహిళలు

పోలవరం, జనవరి 24: బీసీలకు పెద్ద పీట వేసింది టీడీపీ అని టీడీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు డోకల నాగేశ్వరరావు అన్నారు. పోలవరం బొరగం శ్రీనివాసులు నివాసం వద్ద బొడ్డు కృష్ణ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన జయహో బీసీ కార్యక్రమంలో బొరగం శ్రీనివాసులు, కుంచే దొరబాబు, మంగిన కొండ తదితరులు మాట్లాడారు. పట్టిసీమలో 30 మంది ఎస్సీ యువత టీడీపీలో చేరారు. సర్పంచ్ సబ్బారపు శ్రీరామ్మూర్తి, పోతుల శ్రీనివాస్, జె వెంకటనరసింహారావు, పిల్లి నాగరాజు, యడ్ల వినోద్, నునకాని రాంబాబు, పాపోలు గణపతి రత్తయ్య, జల్లేపల్లి జితేంద్ర, కొండే ఏసు పాల్గొన్నారు.

విలన్ పాత్రలకు విప్లవ నేతల పేర్లు తగదు


నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్ష నేతలు

ఏలూరు టూటౌన్, జనవరి 24: సినిమాల్లో విలన్‌పాత్రలకు విప్లవ నేతల పేర్లు పెట్టడం సమంజసం కాదని వామపక్ష నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరు కారం సినిమాలో విలన్ పాత్రలకు కార్ల్ మార్క్స్, లెనిన్ పేర్లు పెట్టడాన్ని నిరసిస్తూ ఐమ్యాక్స్ థియేటర్ వద్ద బుధవారం నిరసన తెలిపారు. సమ సమాజ స్థాపనకు ఎనలేని కృషి చేసిన మహోన్నత వ్యక్తులు కార్ల్‌మార్క్స్, లెనిన్ అన్నారు. వారి పేర్లు విలన్లకు పెట్టడాన్ని ఖండిస్తున్నామన్నారు. తక్షణం ఆ పేర్లు తొలగించని పక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. సీపీఐ నాయకులు కృష్ణచైతన్య, బండి వెంకటేశ్వరరావు, సీపీఎం నాయకులు కిషోర్, రవి, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసి నాయకులు వెంకటేశ్వరరావు, బద్దా వెంకట్రావు, సోమయ్య శ్రీనివాస్, ఆదిశేషు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల వద్ద దోచుకున్న డబ్బు చెల్లించాలి : యూటీఎఫ్


ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో నిరసన ప్రదర్శన

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 24: ఉద్యోగ, ఉపాధ్యాయులు కూడబెట్టుకున్న రూ.20వేల కోట్లను దోచుకున్న ప్రభుత్వం వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు బుధవారం ఫైర్ స్టేషన్ సెంటర్‌లో నిరసన ప్రదర్శన చేసారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ ముస్తఫాఅలీ, రవికుమార్ మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా పెండింగ్‌లోవున్న 11వ పీఆర్సీ, డీఏ బకాయిలు, మెడికల్ బిల్లులు, పీఎఫ్, ఏపీజీఎల్ఐ రుణాలు, ఫైనల్ పేమెంట్లు వెంటనే విడుదలచేయాలని డిమాండ్ చేశారు. అంతకుముందు సంఘ జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఈ నెల 28న రాజమహేంద్రవరంలో చేపట్టనున్న 'ఓట్ ఫర్ ఓపీఎస్' పోస్టర్లను ఆవిష్కరించారు. రానున్న ఎన్నికల్లో ఓపీఎస్‌పై స్పష్టమైన హామీఇచ్చే పార్టీకే తమ మద్దతు ఉంటుందని ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. పీ.వీ.నరసింహారావు, కనకదుర్గ, సుభాషిణి, రాంబాబు, రంగమోహన్, సుధారాణి, మోహన్‌రావు, ప్రసాద్, కమల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల నిర్వాసితులకు పరిహారం అందించండి


వినతిపత్రం ఇస్తున్న బెడదనూరు గిరిజనులు

బుట్టాయగూడెం, జనవరి 24: చింతలపూడి ఎత్తిపోతల పథకంలో భూములు, ఇళ్లు కోల్పోతున్న తమకు పరిహారం అందించాలని బెడదనూరుకు చెందిన గిరిజనులు బుధవారం గిరిజన దర్బార్‌లో ఏపీవో నాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఎత్తిపోతల పథకంలో భూములను కోల్పోతున్నామని, తమకు భూమికి భూమి, ఇళ్ళు, నిర్వాసితులకు ఇచ్చే ప్యాకేజి అందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందించాలని కోరుతుతున్నారు. ఏపీవోను కలిసివారిలో కూరం రాఘవులు, మడకం పుల్లయ్య, పాయం వెంకటేషు, కారం సోమరాజు, రాముడు, కూరం భీమన్న, చిన్న శ్రీను తదితరులు ఉన్నారు. ఆర్ అండ్ ఆర్ కాలనీల్లో మౌలిక సదుపాయాలు, నష్టపరిహారం అందజేత ఇతర సమస్యలపైన నిర్వాసితులు, గిరిజనులు వినతిపత్రాలను అందజేశారు.

బాదంపూడిలో అంబేడ్కర్ విగ్రహం తొలగింపు


విగ్రహాన్ని తొలగిస్తున్న అధికారులు, సిబ్బంది

ఉంగుటూరు, జనవరి 24: రాష్ట్ర బాదంపూడిలో ఏర్పాటు చేసిన బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని హైకోర్టు ఆదేశాల మేరకు అధికారులు బుధవారం తొలగించారు. గత ఏడాది నవంబరు 28న అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీ వారికి ఫిర్యాదు చేయగా మండల సర్వేయర్, డీఏ.సర్వే చేసి విగ్రహం వలిరెడ్డి అన్నవరం ఇంటి ఎదురుగా దారిలో ఉందని తేల్చారు. దీనిపై హైకోర్టును ఆశ్రయించడంతో విగ్రహాన్ని తొలగించాలని ఆదేశాలు ఇచ్చారు. నిడమర్రు సీఐ మోగంటి వెంకట సుభాష్, నిడమర్రు, చేబ్రోలు, గణపవరం, భీమడోలు ఎస్సైలు బందోబస్తుతో తహసీల్దార్ సమక్షంలో విగ్రహాన్ని తొలగించినట్లు అధికారులు, ఈవోపీఆర్డి షేక్ షంషుద్దీన్ తెలిపారు.

అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ

పెదవేగి, జనవరి 24: పరిశ్రమల్లో కార్మికులు అప్రమత్తంగా ఉండాలని, అప్పుడే ప్రమాదాల నివారణ సాధ్యపడుతుందని ఆర్డీవో ఎన్ఎస్కే.ఖాజావలి అన్నారు. నడిపల్లిలోని మొక్కజొన్న ప్రాసెసింగ్ యూనిట్‌లో అగ్నిప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాల నివారణపై ఎన్డీఆర్ఎఫ్, అగ్నిమాపక, రెవెన్యూ, పోలీస్, ఆరోగ్య, పరిశ్రమల శాఖలు సంయుక్తంగా బుధవారం మాక్‌డ్రిల్ ద్వారా కార్మికులకు అవగాహన కల్పించారు. ఆర్.త్రినాథరావు, కృష్ణావతారం, రామకృష్ణ, కె.వెంకటేశ్వరరావు, సర్పంచ్ మేకా అప్పాయమ్మ, అధికారులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడమే లక్ష్యం'

పెదవేగి, జనవరి 24: వైఎస్ షర్మిల నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం వస్తుందని ఆలపాటి నరసింహమూర్తి అన్నారు. ఆయన వైసీపీ నుంచి రెండు రోజుల కిందట షర్మిల సమక్షంలో ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరారు. షర్మిల గురువారం ఏలూరు వస్తున్న సందర్భంగా ముండూరులో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే స్వార్థ రాజకీయాలకు వైసీపీలో ఇమడలేక బయటకు వచ్చామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి, సహకారాన్ని అందిస్తామన్నారు. వైసీపీ నుంచి పలువురు త్వరలోనే కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు తెలిపారు. షర్మిల పర్యటన విజయవంతం చేయాలన్నారు.

లక్ష్మీ గణపతికి పూజలు

ఏలూరు కార్పొరేషన్, జనవరి 24: సత్రంపాడులో లక్ష్మీగణపతి చందనం, పంచరంగుల అలంకారంతో బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని గరికతో అర్చన జరిపి బెల్లం నివేదనలు సమర్పించారు. ఆలయ అర్చకులు రాఘవేంద్రశర్మ పంచామృతాభిషేక అనంతరం హారతులు ఇచ్చారు. పత్తేబాద, దక్షిణపువీధి, పవరుపేట, తదితర ప్రాంతాల్లో గల విఘ్నేశ్వరస్వామి ఆలయాల వద్ద భక్తులు ప్రత్యేక ఆరాధనలతో మొక్కుబడులు చెల్లించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.


మర్రిగూడెం గిరిజన ఆశ్రమ పాఠశాల, నడిచి వెళుతున్న విద్యార్థులు (ఫైల్)

వాహనం వెళ్లని పల్లె

ఆర్టీసీ సర్వీసు లేదు.. ప్రైవేటు వాహనాలు రావు
అధ్వాన రోడ్డులో 108 వాహనం కూడా రాదు
మర్రిగూడెంలో గిరిజనుల అవస్థలు

టి.నరసాపురం, జనవరి 24: మండలంలో గిరిజన గ్రామం మర్రిగూడెంలో ఆర్టీసీ, ప్రైవేటు వాహనాల జాడే లేదు. రోడ్డు అధ్వానం కావడంతో 108 వాహనం కూడా రావడం కష్టమే. ఎటువంటి రవాణా సౌకర్యం లేకపోవడంతో స్థానికులతో పాటు గ్రామంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు 5 కిలోమీటర్ల మేర కాలినడకన వెళ్లాల్సిందే. మర్రిగూడెం చుట్టుపక్కల ఐదు గిరిజన గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి వరకు సుమారు 400 మంది బాలికలు విద్యనభ్యసిస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి విద్యార్థుల తల్లిదండ్రులు రావాలంటే మక్కినవారిగూడెంలో దిగి ఐదు కిలో మీటర్లు నడవాల్సిందే. గతంలో మర్రిగూడెం మీదుగా లంకాలపల్లి వరకు ఆర్టీసీ బస్సు ఉన్నా కొంతకాలం తర్వాత నిలిపివేశారు. ప్రైవేట్ వాహనాలు కూడా తిరగకపోవడంతో గట్టుగూడెం, లంకాలపల్లి, మర్రిగూడెం, సున్నపురాళ్లపల్లి వంటి గిరిజన గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

గిరిజన గ్రామాలపై చిన్న చూపు



గిరిజన గ్రామాలను చిన్నచూపు చూస్తున్నాడు. గిరిజనులకు ప్రాథమిక సౌకర్యాలు కూడా కల్పించాలి. తక్షణమే అధికారులు స్పందించి గిరిజన గ్రామాలకు బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలి.

కుంజా వీరాస్వామి, సున్నపురాళ్లపల్లి

15 ఏళ్లుగా కాలినడకనే..



15 ఏళ్లుగా కాలినడకనే వెళుతున్నాం. అనారోగ్యం సమయంలో ఆటోలు కూడా రావు. ఆ సమయంలో డబ్బులు ఎక్కువ డిమాండ్ చేస్తున్నారు. వెంటనే ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి.

చంద్రరావు, గట్టుగూడెం

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు


దాబాపై చేతికి తగిలే ఎత్తులో విద్యుత్ మెయిన్ లైన్ తీగలు

ప్రగడవరం ముతరాసుల కాలనీలో ఇళ్ల పైనుంచి 33 కెవి విద్యుత్ లైన్‌తో స్థానికులు భయపడుతున్నారు. దాబాపై చేతికి తగిలే ఎత్తులో ఈ విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయని, తొలగించాలని లేదా ఎత్తు పెంచాలని స్థానికులు పదేళ్లుగా విద్యుత్ శాఖాధికారులకు మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. గతంలో కాలనీలో రెండు సంఘటనల్లో ఒకరు మృతి చెందగా, మరొకరు వైకల్యంతో బాధపడుతున్నారని గ్రామస్తులు తెలిపారు. విద్యుత్ లైను సరిచేయడానికి ఆలయ కమిటీ ఖర్చు భరిస్తామన్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. విద్యుత్ లైన్లను మార్పు చేసి రక్షణ కల్పించాలని కోరుతున్నారు. - చింతలపూడి



ఏలూరు, జంగారెడ్డిగూడెంలో మాట్లాడుతున్న బడేటి చంటి, మద్దిపాటి వెంకట్రాజు, దాసరి శేషు, తదితరులు



కామవరపుకోట, పెదపాడు మండలాల్లో సూపర్ సిక్స్ పథకాలు వివరిస్తున్న చింతమనేని ప్రభాకర్, టీడీపీ నేతలు

మహిళా స్వయం సహాయక సంఘాలకు

జగన్ టోకరా

వైసీపీ పాలనపై టీడీపీ నేతల ధ్వజం

భీమడోలు, జనవరి 24: అక్కా, చెల్లెళ్లు అంటూ మహిళలను ఆసరా పేరుతో కల్లబొల్లి మాటలు చెప్పి మహిళా సంఘాలకు సీఎం జగన్ రెడ్డి టోకరా వేశారని, వారిని నిలువునా ముంచాడని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు అన్నారు. ఆయన క్యాంపు కార్యాలయంలో బుధవారం మాట్లాడుతూ జీతాలు పెంచాలని వేడుకున్న అంగన్‌వాడీలపై కక్ష కట్టి వారిపై ఉక్కుపాదం మోపిన జగన్‌రెడ్డి ఆసరాతో మహిళలను ఉద్ధరిస్తాడా అని ప్రశ్నించారు. సకాలంలో డ్వాక్రా రుణాలు చెల్లించిన 75 శాతం మందికి టోకరా వేయడం మోసం కాదా అని ప్రశ్నించారు.

● ఏలూరు టూటౌన్: సైకో జగన్ మహిళలకు టోకరా వేస్తున్నాడని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బడేటి చంటి, గోపాలపురం ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజు విమర్శించారు. బడేటి క్యాంపు కార్యాలయంలో బుధవారం వారు మాట్లాడారు. చంద్రబాబు హయాంలో రూ.5లక్షల వరకు సున్నా వడ్డీ అమలుచేస్తే తాను రూ.10లక్షలకు పెంచుతానని జగన్ హామీ ఇచ్చారన్నారు. ఇప్పుడు రూ.3లక్షల వరకు మాత్రమే సున్నా వడ్డీ ఇస్తున్నారన్నారు. అంగన్వాడీలపై కక్షగట్టి 40రోజుల పాటు ఏడ్పించిన జగన్ మహిళలను ఉద్ధరిస్తామనడం సిగ్గుమాలిన చర్య అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో మహిళల మానప్రాణాలకు భద్రత లేకుండా పోయిందన్నారు.

● జంగారెడ్డిగూడెం: జగన్ రెడ్డి మహిళలను మోసం చేస్తున్నాడని, జీతాలు పెంచమని వేడుకున్న అంగన్వాడీలపై కక్షకట్టి ఉక్కుపాదం మోపిన జగన్ రెడ్డి ఆసరాతో మహిళలను ఎలా ఉద్ధరిస్తారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్‌చంద్రశేషు ప్రశ్నించారు. చింతలపూడి నియోజకవర్గ మీడియా కోర్డినేటర్ చెరుకూరి శ్రీధర్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ మండల అధ్యక్షుడు సాయిల సత్యనారాయణ, పగడం సౌభాగ్యవతి మాట్లాడుతూ మద్య నిషేధమని మహిళల ఓట్లు వేయించుకుని పిచ్చి మద్యంతో ప్రాణాలు తీయడం మహిళోద్ధారణా అని ప్రశ్నించారు. చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, కొండపల్లి రవి, భూసా సత్యనారాయణ రెడ్డి, గొల్లమందల శ్రీనివాస్, ఎలికే ప్రసాద్, చిటికెన శ్రీనివాస్, ఉండవల్లి చంద్రరావు, కొంచాడ ఉమా ప్రసాద్, కర్పూరం వెంకన్నబాబు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

పెదపాడు: మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన జగన్ రెడ్డి పాలనలో అభివృద్ధి కుంటుపడిందని, తిరిగి టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. అప్పనవీడులో బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. చింతమనేని పార్టీ శ్రేణులతో కలసి ఇంటింటికి వెళ్లి మేనిఫెస్టో వివరించారు. జగన్ రెడ్డి మోసపూరిత హామీలతో ఎస్సీ, బీసీలను మోసం చేశారన్నారు. మోరు శ్రావణి, వేమూరి శ్రీనివాసరావు, గారపాటి రామసీత, గుత్తా అనిల్, మట్టా శ్రీనివాసరావు, లావేటి శ్రీనివాసరావు, బెక్కం లక్ష్మీనారాయణ, పావులూరి రామారావు, బోయపాటి పెద్దబ్బాయి, బోయపాటి దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

● కామవరపుకోట: తడికలపూడిలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు తూతా లక్ష్మణరావు ఆధ్వర్యంలో బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. బొంతు వెంకటేశ్వరరావు, మేరుగు సుందరరావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి సూపర్ 6 పథకాలు వివరించారు. తూర్పుయడవల్లి నల్లగోపువారిగూడెంలో కిలారు సత్యనారాయణ ఆధ్వర్యంలో సూపర్-6 పథకాలు వివరించారు. మద్దిపోటి నాగ లింగేశ్వరరావు, అడపా సత్యనారాయణ, తోటకూర మాణిక్యాలరావు, పెద్దింటి లక్ష్మణ, ఘంటా వరాలబాబు, ఘంటా శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

● టి.నరసాపురం: తీగలపల్లిలో టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు పొట్టా రామారావు నాయకత్వంలో ఇంటింటికీ తిరిగి మినీ మేనిఫెస్టో వివరించారు. కార్యక్రమంలో కుంజా లోకేష్, తుట్టి చిన్న నాగేశ్వరరావు, కుంజా వీరా స్వామి, పొట్టా సూర్యచంద్రరావు, కుంజా ఆనంద్, తాటి బాబు, కె.పెద్దబాబు, రవి, పొట్ట గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న భానుశ్రీ

దెందులూరు, జనవరి 24: గ్రామీణ క్రీడాకారులకు అవకాశాలు కల్పించేందుకు ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు దోహద పడతాయాని డిప్యూటీ కలెక్టర్ భానుశ్రీ అన్నారు. నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీలను గోపన్నపాలెం వ్యాయామ విద్య కళాశాలలో బుధవారం ఆమె ప్రారంభించారు. క్రీడల సర్వేక్షణ కోఆర్డినేటర్ ఎ.రాజగోపాల్, తహసీల్దార్ నాంచారయ్య, ఎంపీడీవో శ్రీలత పర్యవేక్షించారు. సర్పంచ్ కోటే నాగ మల్లేశ్వరమ్మ, ప్రిన్సిపాల్ నతానియేల్, వ్యాయమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● చింతలపూడి: క్రీడలలో యువతలో నైపుణ్యం సాధించాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి కె.గీతాంజలి అన్నారు. స్థానిక హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో నియోజకవర్గ స్థాయి క్రీడలను ఆమె ప్రారంభించారు. ఎంపీడీవో మురళీకృష్ణ, ఎంపీపీ బి.రాంబాబు, జడ్పీటీసీ నీరజ, నాలుగు మండలాల పీఈటీలు, పీడీలు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు టూటౌన్: ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు ఏఎస్ఆర్ స్టేడియం, సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రారంభమైనట్లు ప్రత్యేకాధికారి కె.రవికుమార్ తెలిపారు. బ్యాడ్మింటన్, కాబడ్డీ, కుంగ్‌ఫూ, క్రికెట్, వాలీబాల్ పోటీల్లో 15 జట్లు పాల్గొన్నాయి. నగర పాలక సంస్థ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, డీఎస్‌డీవో శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఠాగూర్‌కు భారతరత్న ఇవ్వడంపై హర్షం

బుట్టాయగూడెం, జనవరి 24: బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాగూర్‌కు భారతరత్న ఇవ్వడంపై నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఠాగూర్ శత జయంతి సందర్భంగా నెహ్రూ బొమ్మ సెంటరులో బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మాటూరి ముసలయ్య, మాటూరు వెంకటదుర్గారావు, పి.నాగేశ్వరావు, డి.రాంబాబు, టి.గణేష్, డి.శ్రీను, పి.సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

● లింగపాలెం: రంగాపురంలో కర్పూర్ ఠాగూర్ జయంతి నిర్వహించారు. టీడీపీ సాధికార కమిటీ కన్వీనర్ కొప్పెర్ల నాగరాజు మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేసి ఉన్నత శిఖరాలు అధిరోహించిన కర్పూర్ ఠాగూర్‌ను ప్రతిష్ఠాత్మక భారతరత్న అవార్డుకు ఎంపిక చేయడం అభినందనీయమన్నారు. కొప్పాక వెంకటేశ్వరరావు, కొప్పాక పండు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల తాళాలు తీయండి

కుక్కునూరు, జనవరి 24 : అంగన్వాడీ కేంద్రాల తాళాలు, స్టాక్ ఎందుకు ఇవ్వరని సీఐటీయూ మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ ప్రశ్నించారు. సాయికిరణ్ మాట్లాడుతూ 42 రోజులు పాటు సుదీర్ఘంగా పోరాటం చేసి విధుల్లో చేరితే ప్రభుత్వ సిబ్బంది తాళాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. అంగన్వాడీలు సమ్మెకు వెళ్తే అధికారులు తాళాలు పగలుకొట్టించారు. విధుల్లో చేరిన అంగన్వాడీలకు చాలా చోట్ల సాయంత్రం వరకు సెంటర్ తాళాలు, స్టాక్ వివరాలు కానీ ఇవ్వలేదన్నారు. కుళ్ళిన కోడిగుడ్లను పట్టుకెళ్లి ఇవ్వండి అని సచివాలయం సిబ్బంది అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు.

భూహక్కు చట్టం రద్దు చేయాలి


నిరాహార దీక్ష చేస్తున్న న్యాయవాదులు

ఏలూరు టూటౌన్, జనవరి 24: రైతుల భూములను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకే ప్రభుత్వం భూ యాజమాన్య హక్కుల చట్టం తెచ్చిందని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ విమర్శించారు. జిల్లా కోర్టు వద్ద న్యాయవాదుల నిరాహార దీక్షలకు రైతు సంఘం సంఘీభావం ప్రకటించింది. ఈ చట్టం వలన రైతులు, ప్రజలు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. రాజ్యాంగ హక్కులను తుంగలో తొక్కి రైతులను ఇబ్బందులపాలు చేస్తున్నారన్నారు. జీవో నెం 512 తక్షణం రద్దు చేయాలని, లేనిపక్షంలో ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

రహదారి భద్రతా నియమాలు పాటించాలి

పెదపాడు, జనవరి 24: వాహన చోదకులు రహదారి భద్రతా నియమాలను విధిగా పాటించాలని ఎంవీఐ కేవీఎస్‌ప్రసాద్ తెలిపారు. సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఉప రవాణా కమిషనర్ శాంతకుమారి ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వాహనదారులు వారి గుర్తింపు కార్డులపై బ్లడ్‌గ్రూపు ఉండే విధంగా చూసుకోవాలన్నారు. జి.ప్రసాద్, ఏఎంవీఐ ఆజ్మీరా, బి.శ్రీనివాసు, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధరల గ్యారెంటీ చట్టాన్ని తేవాలి

ఉంగుటూరు,జనవరి 24: మద్దతు ధరల గ్యారెంటీ చట్టం అమలులోకి తేవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కైకరంలో గుత్తికొండ వెంకట కృష్ణారావు అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 26న ఏలూరులో జరిగే ట్రాక్టర్ల ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. ఢిల్లీ రైతాంగం పోరాట ఫలితంగా మోదీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. రైతుల రుణాలు ఎందుకు మాఫీ చేయడం లేదని శ్రీనివాస్ ప్రశ్నించారు. సమావేశంలో కొర్ని అప్పారావు, వెజ్జు శ్రీరామచంద్రమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

తాండ్ర పాపారాయుడు వర్ధంతి

చింతలపూడి, జనవరి 24 : తాండ్ర పాపారాయుడు వర్ధంతి సందర్భంగా వెలమపేటలో విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆర్నేపల్లి అప్పారావు మాట్లాడుతూ తాండ్ర పాపారాయుడు వీరత్వాన్ని కొనియాడారు. రెడ్డి హేమంత్‌కుమార్, బోను ఉమామహేశ్వరావు, బోదల శ్రీను, డోకల రాము, చింతల ఉమామహేశ్వరావు, వేములపల్లి రామారావు పాల్గొన్నారు.

ఎక్సైజ్ దాడుల్లో ముగ్గురి అరెస్టు

చింతలపూడి, జనవరి 24: సర్కిల్ పరిధిలో దాడులు చేసి సారా కలిగిన ముగ్గురిని అరెస్టు చేసినట్టు ఎస్ఈబి సీఐ ప్రసాద్ తెలిపారు. నాగిరెడ్డిగూడెంలో ఇస్లావతు రాము నుంచి 20 లీటర్లు, ప్రగడవరంలో కంకిపాటి సతీష్ నుంచి 5 లీటర్లు, తూర్పుయడవల్లిలో దాసరి పద్మ నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఎస్ఈబి ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్ది ఆంజనేయుడిని దర్శించుకున్న మిథున్‌రెడ్డి

జంగారెడ్డిగూడెం, జనవరి 24: వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్, ఎంపీ మిథున్ రెడ్డి బుధవారం గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సన్నాహాల్లో భాగంగా ఏలూరులో 30న జరిగే సభలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాల్గొంటారని, సభ విజయవంతానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యేలు, పార్టీ శ్రేణులను కలసి సభను విజయవంతం చేసేందుకు కార్యాచరణ చేపట్టినట్లు తెలిపారు. పార్టీ కోసం కష్టపడి ప్రతి ఒక్కరికి వైసీపీ సముచిత స్థానం కల్పించడం జరుగుతుందని మిథున్ రెడ్డి అన్నారు. మద్ది ఆంజనేయస్వామిని ఎంపీలు మిథున్‌రెడ్డి, కోటగిరి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యేలు ఆళ్ల నాని, తెల్లం బాలరాజు, ఎమ్మెల్సీ కౌరు శ్రీనివాస్, వైసీపీ చింతలపూడి నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు, ఏలూరు పార్లమెంటరీ సమన్వయకర్త కారుమూరి సునీల్ దర్శించుకున్నారు. ఆలయ ఈవో ఆకుల కొండలరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం అర్చకులు ఆశీర్వచనాలు అందజేసి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

చింతలపూడి, జనవరి 24: గాంధీనగర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణ మహోత్సవం బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. దేవదాయ శాఖ ప్రచార మాసోత్సవాల్లో భాగంగా జిల్లాలోని 28 మండలాల్లో రోజుకో మండలంలో కల్యాణం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం పూజారి కిళాంబి మారుతి ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ ఏర్పాట్లు నిర్వహించగా, భక్తులు భారీగా పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

లింగపాలెం, జనవరి 24: కె.గోకవరం పీహెచ్‌సీ పరిధిలోని ఆసన్నగూడెంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. చింతలపూడి సబ్ యూనిట్ ఆఫీసర్ ఎస్.ప్రసాద్ హాజరయ్యారు. ఇళ్ల, పరిసరాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. వ్యాధులు రాకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఇంటింటికి వెళ్లి వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, దివ్య, రేణుక, ఆశ, పార్వతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు క్రైం :** కార్మికులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందడంలో ఇబ్బందులపై ఉచిత న్యాయ సహాయం కోసం జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాలని ఆ సంస్థ కార్యదర్శి కె రత్న ప్రసాద్ తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలోని లోక్ అదాలత్ భవనంలో భవన కార్మికులకు అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు.
- **ఏలూరు కార్పొరేషన్ :** చింతలపూడి కాంగ్రెస్ టికెట్ కోసం న్యాయవాది ఉప్పే రాజ్‌కుమార్ తన దరఖాస్తును ఎఐసీసీ ప్రధాన కార్యదర్శి మాణిక్యం ఠాకూర్‌కు అందజేశారు. టికెట్ తనకు కేటాయిస్తే విజయం సాధిస్తాననే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.
- **ఏలూరు టూటౌన్ :** టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఏలూరుకు చెందిన బీవీఎన్ గణపతిరావును అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు నియమించారు. రాష్ట్ర బీసీసెల్ కమిటీని అచ్చెం నాయుడు ప్రకటించారు. నాగరాజును అధికార ప్రతినిధిగా నియమించారు.
- కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని వికసిత్ భారత్ సంకల్ప యాత్ర పేరుతో కార్యక్రమాలు ఈ నెల 24నుంచి 28 వరకు నిర్వహిస్తున్నట్లు నగర పాలక సంస్థ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ తెలిపారు.
- **ఏలూరు రూరల్ :** వాణిజ్య పన్నుల శాఖ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా శాఖ ముద్రించిన క్యాలెండర్‌ను జాయింట్ కమిషనర్ శ్రీలత ఆవిష్కరించారు. బీవీ.బాబు, పి.రాజేష్‌బాబు, జి.ఇందిరమ్మ, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.
- **పెదపాడు :** హైస్కూల్ 10వ తరగతి విద్యార్థులకు జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ అందజేసిన స్టడీ మెటీరియల్‌ను ఎంపీపీ బత్తుల రత్నకుమారి పంపిణీ చేశారు. ఎంపీడీవో తేజరతన్, ఎంఈవో-2 దేవినేని వెంకటరమణ మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు.
- పెదపాడులో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద యాత్రలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పాల్గొన్నారు. సంక్షేమ నగదును లబ్ధిదారుల ఖాతాలో నేరుగా జమ చేయడం జరుగుతుందన్నారు. జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, ఎంపీపీ బత్తుల రత్నకుమారి, అప్పన ప్రసాద్ పాల్గొన్నారు.
- **ఉంగుటూరు :** ఎమ్మెల్యే పుప్పాల శ్రీనివాసరావు 39 మందికి ఇంటి స్థలాల పట్టాలు అందజేశారు. ఉంగుటూరులో 16, ఉప్పాకపాడులో5, నాచుగుంటలో 7, వీపీ.పురంలో 7, నల్లమాడు 1, కంసాలిగుంటలో 2, నీలాద్రిపురంలో ఒకరికి ఈ పట్టాలు అందజేశారు. ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, సర్పంచ్‌లు, తహసీల్దార్ వెంకట రమణ, తదితరులు పాల్గొన్నారు.
- **భీమడోలు :** భీమడోలు ఎస్ఈబీ పోలీసులు చేసిన తనిఖీలలో భాగంగా ద్వారకా తిరుమల మండలం లక్ష్మీనగరంలో ఆలపాటి శేఖర్ వద్ద ఎన్డీపీ లిక్కర్ గుర్తించారు. సుంకం చెల్లించని ఎనిమిది మద్యం సీసాలు (750 ఎంఎల్) పట్టుకున్నారు. అతడి నుంచి మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు విచారణాధికారులు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎల్‌వో రాధాకృష్ణ



శ్రీపర్రులో బాలికల దినోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

బాలికలు అందరూ చదువుకోవాలి

ఏలూరు కలెక్టరేట్, జనవరి 24: స్థానిక ఈదర సుబ్బమ్మదేవి మునిసిపల్ హైస్కూల్లో ఐసీడీఎస్, జిల్లా బాలల సంరక్షణ యూనిట్ ఆధ్వర్యంలో బుధవారం జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. విద్యాశాఖ ఏఎల్‌వో జి.రాధాకృష్ణ మాట్లాడుతూ బాలికలు ప్రతిఒక్కరూ చదువుకోవాలని, 18 ఏళ్లలోపు పిల్లలకు వివాహం చేస్తే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కి తెలియజేయాలన్నారు. దిశ మహిళా పోలీస్ స్టేషన్ ఎస్సై క్రాంతిప్రియ మాట్లాడుతూ బడికి దూరంగా ఉన్న పిల్లలు, బాల్య వివాహాల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తెలియచేయాలన్నారు. డీసీపీవో సీహెచ్ సూర్యచక్రవేణి జాతీయ బాలికా దినోత్సవ విశిష్టత వివరించారు. చైల్డ్‌హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ వైవి.రాజు, పాఠశాల హెచ్ఎం కుటుంబరావు, డీసీపీయూ కౌన్సిలర్ బాలస్వామి, పాఠశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు టూటౌన్: బాలికలంతా బడిలో ఉండేలా చూడాలని గ్రామ కార్యదర్శి ఎ.మంజులావణ్య అన్నారు. శ్రీపర్రులో చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవ ర్యాలీ జరిగింది. బాలికలను రక్షించుకుదాం వారి హక్కు కాపాడదాం పోస్టర్‌ను ఆవిష్కరించారు. మహిళా పోలీస్ వైదేహి మాట్లాడుతూ బాలికా విద్యతో సాధికారత సాధ్యమవుతుందన్నారు. బాలికలపై నేరాలు జరిగినప్పుడు రక్షణ కోసం 100, పోలీస్, చైల్డ్ హెల్ప్ లైన్ 1098, ఉమెన్ హెల్ప్‌లైన్ 181కు ఫిర్యాదు చేయాలన్నారు. వీఆర్‌ఏ రాజేంద్ర, కోఆర్డినేటర్ రఘుబాబు, తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు ఎడ్యుకేషన్: ఆడ పిల్లలపై వివక్ష దూరమైనపుడే సాధికారత సాధ్యమని సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల ప్రిన్సిపాల్ మెర్సీ అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా బుధవారం కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రతీ ఆడపిల్లకు విద్య, ఆరోగ్య, ఉద్యోగ రంగాల్లో సమాన అవకాశాలు ఉండాలని ఆకాంక్షించారు. ఉమెన్‌సెల్ సభ్యులు పద్మావతి, రాణి, సరస్వతి, మేరీ ఫ్లోరెన్స్, పరీక్షల కంట్రోలర్ సిస్టర్ సుశీల తదితరులు పాల్గొన్నారు.

● భీమడోలు: అన్నేవారిగూడెం పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. బాలికా విద్య లక్ష్యాల సాధనలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విద్యార్థులకు చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


అటపాక పక్షుల కేంద్రాన్ని సందర్శించిన విద్యార్థులు

చిత్తడి నేలలతోనే మానవజాతి మనుగడ

కైకలూరు, జనవరి 24: చిత్తడి నేలలతోనే మానవజాతి మనుగడ సాధ్యమని వక్తలు పేర్కొన్నారు. ప్రపంచ చిత్తడినేలల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం అటపాక పక్షుల కేంద్రంలో నూజివీడు మండలం పల్లెర్లముడి గ్రామానికి చెందిన జడ్పీ హైస్కూల్ విద్యార్థులు, కైకలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు అటపాక పక్షుల కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖన పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. చిత్తడి నేలలు విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ప్రపంచంలో అనేక చిత్తడి నేలలుండగా అందులో కొల్లేరు సరస్సు ఉండడం ఈ ప్రాంతానికి ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. ఇలాంటి చిత్తడి నేలలను సంరక్షించుకోవాల్సిన అవసరముందని విద్యార్థులకు వివరించారు. ఏపీఎస్‌జీసీ ప్రాజెక్టు ఆఫీసర్ సత్యనారాయణ, నేషనల్ గ్రీన్ కోర్ జిల్లా సమన్వయకర్త స్వర్ణ వెంకటేశ్వరరావు, క్లస్టర్ కో-ఆర్డినేటర్ మధుసూదనరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆరుతెగలపాడు, చెక్కపల్లి గ్రామాల్లో పరిటాల రవికి నివాళులు

చిరస్మరణీయుడు పరిటాల రవి

కలిదిండి, జనవరి 24 : పేదల అభ్యున్నతికి పాటుపడిన పరిటాల రవి చిరస్మరణీయుడని మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ అన్నారు. రవి వర్ధంతిని పురస్కరించుకుని ఆరుతెగలపాడులో నియోజకవర్గ ఐ-టీడీపీ సోషల్ మీడియా అధ్యక్షుడు వేంపాటి ప్రవీణ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పరిటాల చిత్రపటానికి కామినేని పూలమాల వేసి నివాళులర్పించారు. రక్తదాన శిబిరం నిర్వహించారు. జడ్పీటీసీ మాజీ సభ్యులు బి.విజయలక్ష్మి, టీడీపీ బీసీ సెల్ కార్యనిర్వహణ కార్యదర్శి గూడవల్లి శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ తాడినాడ బాబు, నాయకులు గంగుల శ్రీదేవి, శీలం కృష్ణవేణి, కాళ్లపాలెం సర్పంచ్ పేటేటి స్వర్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు: మాజీ మంత్రి, టీడీపీ నాయకుడు పరిటాల రవి 19వ వర్ధంతిని పురస్కరించుకుని చెక్కపల్లిలో రవి విగ్రహానికి టీడీపీ నాయకుడు కూచిపూడి దేవేంద్ర పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ బలోపేతానికి విశేష కృషి చేయడంతో పాటు బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి రవి విశేష కృషి చేశారన్నారు. నాయకులు చిలుకూరి వెంకటేశ్వరరావు, కాటేపల్లి నాగేశ్వరరావు, పల్లిబోయిన సత్యనారాయణ, కాటేపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆంజనేయస్వామి శాంతి కల్యాణం

కైకలూరు, జనవరి 24: కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారి కళామండపం వద్ద గురువారం సాయంత్రం గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి వారి ధర్మప్రచారంలో భాగంగా ఆంజనేయస్వామి శాంతి కల్యాణం నిర్వహించనున్నట్లు కైకలూరు ఆలయ ఈవో వీఎన్‌కె శేఖర్ తెలిపారు. భక్తులు పెద్దఎత్తున తరలిరావాలని ఆయన కోరారు.

క్రైం కార్నర్

గన్ పౌడర్ పేలి అసోం వాసి మృతి

మరొకరికి గాయాలు

ముదినేపల్లి, జనవరి 24 : పిట్టలను షూట్ చేసే తుపాకీల్లో వినియోగించే గన్ పౌడర్ పేలి ముదినేపల్లి మండలం చినకామనపూడిలో అసోంకు చెందిన ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్ర గాయాలకు గురైన ఘటన మంగళవారం రాత్రి జరిగింది. ఎస్ఐ వెంకట్ కుమార్ వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఆళ్ల వీరాంజనేయులు చేపల చెరువుపై అసోంకు చెందిన బికాస్ బరో, రిటూ బరోను పిట్టలను కాల్చేందుకు తుపాకులతో కాపలా ఉంటున్నారు. చెరువుల్లోని చేపలను తినేందుకు నీటిపై వాలే కాకులు, పిట్టలను వారు తుపాకులతో కాల్చి చంపుతుంటారు. ఇందుకు తుపాకుల్లో వినియోగించే గన్ పౌడర్‌ను తయారు చేసుకుంటారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి పౌడర్‌ను తయారు చేస్తుండగా, హఠాత్తుగా పేలి భారీ శబ్దంతో మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో రిటూ బరో (25) అక్కడికక్కడే మరణించాడు. తలకు తీవ్ర గాయాలైన బికాస్ బరోను వెంటనే గుడివాడ ప్రభుత్వాసుపత్రికి 108లో తరలించి మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని కైకలూరు సీఐ కృష్ణ కుమార్, ముదినేపల్లి ఎస్ఐ వెంకట్ కుమార్ బుధవారం ఉదయం పరిశీలించారు. తుపాకులు సప్లయి చేసి పనులు అప్పగించిన ప్రస్తుతం వరహపట్నంలో ఉంటున్న తమిళనాడుకు చెందిన కంట్రాక్టర్ సతీష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

నూజివీడు టౌన్, జనవరి 24: ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. నూజివీడు రూరల్ పోలీసుల వివరాల ప్రకారం నూజివీడు మండలం వెంకటాద్రిపురం గ్రామానికి చెందిన కొలుసు నాగేంద్రరావు (62) ఈ నెల 1న కూలి పనులకు వెళ్ళి తిరిగి ఇంటికి వెళ్తుండగా విస్సన్నపేట వద్ద ద్విచక్రవాహనం ఢీ కొట్టింది. దీంతో నాగేంద్రరావు తీవ్రగాయాల పాలవ్వగా, అతడ్ని నూజివీడు ప్రభుత్వాసుపత్రికి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందినట్టు తెలిపారు.

మోటారు సైకిల్‌ను ఢీకొన్న కారు

ముగ్గురికి తీవ్ర గాయాలు


గాయపడిన చిన్ని

మండవల్లి, జనవరి 24: మండవల్లి మండలం మణుగులూరు వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యభర్తలతో పాటు లేడీ డాక్టర్‌కు కూడా తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం ఏలూరు ఆశ్రం ఆస్పత్రి నుంచి విధులు ముగించుకొని కారులో కైకలూరు వస్తున్న ఓ లేడీ డాక్టర్ మణుగులూరు వద్ద లారీని ఓవర్ టేక్ చేస్తూ ఎదురుగా ఏలూరు వైపు బైక్‌పై వస్తున్న మండవల్లి మండలం దయ్యంపాడు గ్రామానికి చెందిన కంభంపాటి చిన్న, అతని భార్య అజితను ఢీకొని రోడ్డు పక్క కాలవలోకి దూసుకుపోయింది. బైక్‌పై వస్తున్న దంపతులతో పాటు లేడీ డాక్టర్ కూడా గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన దంపతులిద్దరినీ అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం లేడీ డాక్టర్‌ను కూడా ఆస్పత్రికి తరలించినట్టు తెలిసింది. సంఘటనా స్థలానికి మండవల్లి పోలీసులు చేరుకుని ప్రమాద వివరాలు సేకరిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

ముదినేపల్లి రూరల్, జనవరి 24: ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న బైక్‌ను ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొనడంతో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం మండలంలోని వాడపల్లి గ్రామానికి చెందిన ముమ్మిడిశెట్టి రమణకుమారి భర్తతో కలసి బైక్ పై గుడివాడవైపు వెళుతుండగా సింగరాయపాలెం నాలుగురోడ్ల కూడలిలో లారీ ఢీ కొనడంతో రమణకుమారికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సహాయంతో ఆమెను అంబులెన్స్‌లో గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట శిబిరంపై దాడి

కలిదిండి, జనవరి 24 : సానారుద్రవరంలో బుధవారం పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని రూ.34 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ ప్రియకుమార్ తెలిపారు. గ్రామాల్లో పేకాట శిబిరాలు నిర్వహిస్తే పోలీసులకు సమాచారం అందించాలని, వివరాలు తెలిపిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సబ్ కలెక్టర్ తదితరులు


బాలికలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు

బాల్య వివాహాలు చేస్తే జైలే

నూజివీడు టౌన్, జనవరి 24: బాల్యవివాహాలు చేసినా, ప్రోత్సహించినా రెండేళ్ల వరకు జైలుశిక్ష విధించే అవకాశం ఉందని, నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రో చైల్డ్‌గ్రూప్, చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహిళలు, బాలికలపై లైంగిక నేరాలను అరికట్టాలని, బాలికలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నూజివీడు స్నేహరైడ్స్ ఛైర్మన్ బసవరాజు నగేష్, స్నేహరైడ్స్ విద్యార్థినీ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి

ముసునూరు, జనవరి 24: బాలికలు రక్తహీనత బారిన పడకుండా ఉండాలంటే క్రమం తప్పకుండా పౌష్టికాహారాన్ని తీసుకోవాలని అంగన్‌వాడీ కార్యకర్త పి.రాజకుమారి అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా బుధవారం గోగులంపాడు ఎంపీ యూపీ పాఠశాలలో బాలికలకు పౌష్టికాహారం, బాల్యవివాహాలు తదితర అంశాలపై అంగన్‌వాడీలు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాజకుమారి మాట్లాడుతూ పౌష్టికాహార లోపం వల్ల బాలికల్లో అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, వీటిని అధిగమించాలంటే పౌష్టికాహారాన్ని తీసుకోవాలని వివరించారు. అలాగే బాల్యవివాహాలు చేసుకోవడం వల్ల భవిష్యత్తులో తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని, బాల్య వివాహాలు నేరమన్నారు. పాఠశాల హెచ్‌ఎమ్ రామరాజేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు విజయ్‌కుమారి, సుందరమ్మ, శ్యామల తదితరులు పాల్గొన్నారు.


ముసునూరు బీసీ సభలో మాట్లాడుతున్న ముద్దరబోయిన


మట్టగుంట బీసీ సదస్సులో మాట్లాడుతున్న కమ్మిలి విఠల్ రావు

బీసీలకు ద్రోహం చేసిన జగన్

టీడీపీతోనే న్యాయం
జయహో బీసీ సభల్లో వక్తలు

ముసునూరు, జనవరి 24: సంక్షేమ పథకాలలో బీసీలకు 20 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత ఎన్టీఆర్‌దేనని, నూజివీడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ శాసనసభ్యులు వెంకటేశ్వరరావు అన్నారు. ముసునూరులో జయహో బీసీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తొలుత ఎన్టీఆర్, జ్యోతి బాపూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సబ్‌ప్లాన్ నిధులు మళ్ళించి బీసీలకు జగన్ ద్రోహం చేశాడన్నారు. బీసీలు అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే టీడీపీని గెలిపించుకోవాలన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా బీసీలపై దాడులు ఎక్కువయ్యాయని, చంద్రబాబుతోనే బీసీలకు మేలు జరుగుతుందన్నారు. చంద్రబాబు లక్ష సైకిళ్ళు కొనుగోలు చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువస్తే జగన్ వాటిని గొడౌన్‌లో పడేశారని ముద్దరబోయిన ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ బిడ్డ.. మీ బిడ్డ అని పదేపదే చెప్పే జగన్ మన బిడ్డకాదు... క్యాన్సర్ గడ్డ అన్నారు. టీడీపీ బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్, రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షుడు చలమోలు అశోక్‌గౌడ్, టీడీపీ ముసునూరు మండల అధ్యక్షుడు శ్రీ దేవినేని డేలారాం, ప్రధాన కార్యదర్శి కందుల పిచ్చియ్య, బీసీ సెల్ అధ్యక్షుడు మసిముక్కు సుబ్బారావు, జనసేన నాయకులు మరీదు శివరామకృష్ణ, రాష్ట్ర తెలుగుయువత కార్యనిర్వహణ కార్యదర్శి గద్దె రఘుబాబు, ముసునూరు మండల బీసీసెల్ ప్రధాన కార్యదర్శి మిద్దె సత్యనారాయణ, ఆగిరిపల్లి, ముసునూరు మండల ఎస్సీసెల్ అధ్యక్షులు గూడపాటి అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీసీల సంక్షేమమే టీడీపీ ధ్యేయం: కమ్మిలి విఠల్‌రావు

కలిదిండి: బీసీల సంక్షేమమే టీడీపీ ధ్యేయమని మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్ రావు అన్నారు. బుధవారం మట్టగుంటలో బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అంద్రాజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో జయహో బీసీ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం బీసీ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించకుండా నిర్వీర్యం చేసిందన్నారు. బడుగు, బలహీన వర్గాలపై దాడులు పెరిగాయన్నారు. చట్టసభల్లో బీసీలకు పెద్ద పీట వేసిన ఘనత టీడీపీకే దక్కుతుందాన్నరు. బీసీ రక్షణ చట్టం టీడీపీతోనే సాధ్యమన్నారు. బీసీలంతా ఐక్యంగా టీడీపీ గెలుపునకు కృషి చేయాలన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు మెంటే పార్థసారధి, టీడీపీ మండల అధ్యక్షులు జోగిరాజు, త్రినాథరాజు, నాయకులు వీరమల్లు నరసింహారావు, బొమ్మనబోయిన విజయలక్ష్మి, రెడ్డి చక్రవర్తి, పెన్మెత్స వెంకట్, వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, గూడవల్లి శ్రీనివాసరావు, రత్నారావు పాల్గొన్నారు.


వీణల తయారీదారు షేక్ మాబును సత్కరిస్తున్న చైర్మన్ జయలక్ష్మి

ప్రతి జిల్లా కేంద్రంలో హ్యాండీ క్రాఫ్ట్ బజార్

వీణల తయారీ కేంద్రాన్ని సందర్శించిన హెచ్‌డీసీ చైర్మన్

నూజివీడు, జనవరి 24: చేతివృత్తిదారుల సంక్షేమానికి ప్రతి జిల్లా కేంద్రంలో వైఎస్సార్ హ్యాండీ క్రాఫ్ట్ బజార్ల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు హ్యాండీ క్రాఫ్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బడిగించల జయలక్ష్మి అన్నారు. నూజివీడు పట్టణంలో వీణల తయారీ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా దాదాపు 17 జాతీయ, అంతర్జాతీయ అవార్డులు అందుకున్న వీణల తయారీదారు షేక్ మాబును సత్కరించారు. అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ప్రతి జిల్లా కేంద్రంలో వైఎస్సార్ హ్యాండీక్రాఫ్ట్ బజారులను ఏర్పాటు చేసేందుకు స్థలాలను సేకరిస్తున్నామన్నారు. అదేవిధంగా కళాకారులైన మహిళలతో స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ సందర్భంగా వీణల తయారీకి శిక్షణ ఇచ్చేందుకు ముందుకు వచ్చిన మాబుకు భూమిని మంజూరు చేసేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానన్నారు. విశ్వకర్మ సమ్మాన్ యోజన ద్వారా శ్రీకాకుళం, కడప, కర్నూలు, చిత్తూరు, జమలమడుగులో ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, ఇప్పటికే ఈ పథకం ద్వారా 10 వేల మంది శిక్షణ పొందేందుకు తమ పేర్లు రిజిస్టర్ చేయించుకున్నారన్నారు. రాష్ట్రంలో బొబ్బిలి తరువాత నూజివీడు వీణలతయారీ కేంద్రంగా ఉండటం అభినందనీయమన్నారు. బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బడిగించల చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో దళితుల ఐక్యత చాటాలి



ముదినేపల్లి, జనవరి 24 : రానున్న సాధారణ ఎన్నికల్లో దళితుల ఐక్యత చాటి చెప్పాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సేవా నాగ జగన్ బాబూరావు అన్నారు. స్థానిక దళిత సంఘాల కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కైకలూరు నియోజకవర్గ మాలమహానాడు, అనుబంధ సంఘాల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో దళితులపై మోపిన అక్రమ కేసులపై పోరాడాలన్నారు. నియోజకవర్గంలో దళిత చైతన్య యాత్రను నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా మాలమహానాడు యువజన విభాగం నియోజకవర్గ కార్యదర్శిగా మట్లా మోహన కుమార్‌కు నియామక పత్రం అందజేశారు. నాయకులు జక్కుల విజయ్ కుమార్, చీలి లావణ్య, అందుగుల ప్రతాప్ కుమార్, గూట్ల పాల్, భూపతి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలి : కామినేని



కైకలూరు, జనవరి 24: సమాజ శ్రేయస్సు కోసం రానున్న ఎన్నికల్లో మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. బుధవారం కైకలూరు మండలం రామవరం, వదర్లపాడు గ్రామాల్లో ఆత్మీయ సమావేశాలను నిర్వహించారు. వదర్లపాడులో వందలాది మంది ప్రజలు ఆయనను ఊరేగింపుగా గ్రామంలోనికి తీసుకువెళ్లారు. అనేకచోట్ల మహిళలు హారతులు పట్టి కామినేనికి తిలకం దిద్దారు. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం విచ్ఛిన్నం అయిందని అందువల్ల ప్రజలందరూ విజ్ఞతతో ఆలోచించి రానున్న ఎన్నికల్లో ఓట్లు వేయాలని కోరారు. వదర్లపాడులో రూ.3.80 కోట్లతో రహదారి నిర్మాణాన్ని చేపట్టానన్నారు. ప్రస్తుతం గ్రామంలో అనేకమందిపై వైసీపీ నాయకులు కేసులు బనాయించారని అలాంటి నాయకులకు తగిన బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందన్నారు. వదర్లపాడు మాజీ ఎంపీటీసీ పుప్పాల సూర్యప్రకాశరావు, కైకలూరు యువజన నాయకుడు కేవీఎన్‌ఎం నాయుడు, పెరుగు సత్యనారాయణ, జనసేన నాయకులు పుప్పాల తాతయ్య, కొల్లి వరప్రసాద్, తోట లక్ష్మీ, టీడీపీ నాయకులు బీకేఎం నాని, పూల రామచంద్రరావు, బలే ఏసురాజు, రామవరం గ్రామ అధ్యక్షుడు చిన్ని, తాళ్లూరి రాజేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఆసరా పేరుతో టోకరా : ముద్దరబోయిన

నూజివీడు, జనవరి 24: ఆసరా పేరుతో రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు టోకరా వేసిందని నూజివీడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. నూజివీడు పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం రుణమాఫీని పక్కాగా అమలు చేసి 85 లక్షల డ్వాక్రా మహిళలకు మూడు విడతల్లో ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పున రూ.8,500 కోట్లు రుణాలను మాఫీ చేసిందన్నారు. అందరికి సమన్యాయం చేయాలనే లక్ష్యంతో పసుపు, కుంకుమ పేరుతో 2018-19 సంవత్సరంలో పదివేల కోట్లు వడ్డీ రాయితీ కింద 2514 కోట్లు చెల్లించగా, టీడీపీ రుణమాఫీ చేయలేదంటూ జగన్‌రెడ్డి పచ్చి అబద్ధాలను చెప్పడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో కోటి 14 లక్షల మంది డ్వాక్రా మహిళలుంటే 79 లక్షల మందికే ఆసరా అంటూ సకాలంలో డ్వాక్రా రుణాలు చెల్లించిన 75 శాతం మందిని మోసం చేశాడన్నారు. టీడీపీ ప్రభుత్వంలో పొదుపు మహిళలకు సున్నా వడ్డీ ఐదు లక్షల వరకు వర్తింప చేస్తే దానిని 10 లక్షలకు పెంచుతానని నమ్మించి అధికారంలోకి రాగానే 3 లక్షలకు కుదించటం మహిళలను మోసం చేయటం కాదా? వాస్తవంగా మూడు లక్షలకు కూడా సున్నా వడ్డీ కేంద్రమే భరిస్తుందని జగన్ రెడ్డి ఇచ్చింది శూన్యమన్నారు. వృద్ధాప్యంలో ఆదుకుంటాయని డ్వాక్రా మహిళలు దాచుకున్న రూ. 2 వేల118 కోట్లు అభయహస్తం నిధులు దారి మళ్ళించటం మహిళా సంక్షేమం ఎలా అవుతుందన్నారు. మద్య నిషేదం అమలు చేసి మహిళల రుణం తీర్చుకుంటానన్న జగన్‌రెడ్డి నాసిరకం మద్యంతో వారి మాంగల్యాలను తెంచుతున్నాడన్నారు. కళ్యాణమిత్ర, బీమామిత్ర, పశుమిత్రలుగా పనిచేస్తున్న 7 వేల మందికి పైగా సిబ్బందిని విధుల నుంచి తొలగించి మహిళోద్ధారకుడిగా ప్రచారం చేసుకోవడం దుర్మార్గమన్నారు. కౌన్సిలర్ దాసరి స్వామి, టీడీపీ నాయకుడు ఎలిగే గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ యాత్రలు


కొరగుంటపాలెంలో వికసిత్ భారత్ కేంద్ర బృందం అధికారులు

ముదినేపల్లి, జనవరి 24: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులంతా పొందాలన్నదే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర లక్ష్యమని కేంద్ర బృందం వైద్య విభాగం సీఎంఒ డాక్టర్ మనోజ్ జైన్ అన్నారు. కొరగుంటపాలెంలో ఎంపీడీవో మల్లీశ్వరి అధ్యక్షతన బుధవారం జరిగిన సంకల్ప యాత్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీనియర్ సీఎంఒ డాక్టర్ వేదాంత సుబాష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యం అందించటం ఈ కార్యక్రమంలో భాగమన్నారు. మండలంలో అమలు జరుగుతున్న కుటుంబ సంక్షేమ కార్యక్రమాలను తెలుసుకున్నారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ శర్మిష్ట, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: నూజివీడు ఆర్అండ్‌బీ కార్యాలయం వద్ద బుధవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రం ప్రజా సంక్షేమానికి అమలు పరుస్తున్న పథకాలపై అధికారులు వివరించారు. ప్రధానంగా బాలికా విద్య, సంరక్షణపై కేంద్రం దృష్టి సారించిందన్నారు. నూజివీడు మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు చౌటపల్లి విక్రమ్‌కిషోర్, నూజివీడు నియోజకవర్గ కన్వీనర్ జి.ఆర్‌కె రంగారావు, పట్టణ బీజేపీ అధ్యక్షులు బోనుఅప్పారావు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు వసుంధరాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: వికసిత్ భారత్ సంకల్పయాత్ర ఆగిరిపల్లి మండలం చిన్నాగిరిపల్లి, పోతవరప్పాడు, అమ్మవారిగూడెం, పిన్నమరెడ్డిపల్లి పంచాయతీల్లో జరిగింది. హార్టీకల్చర్ ఆఫీసర్ జ్యోతిప్రియాంక, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎల్.సులోచనారాణి, ఎంఈవో కె.సర్వేశ్వరరావు, హౌసింగ్ ఏఈ షేక్ అలీముల్లా, ఇండేన్ గ్యాస్ అధినేత పాలడుగు శ్రీనివాస్ గోపాలపురంలో ఉజ్వల గ్యాస్ పథకంలో లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్లు అందజేయడమే కాక సురక్షితమైన పద్ధతిలో ఎలా ఉపయోగించాలో నూజివీడు ఫైర్‌స్టేషన్ సిబ్బందితో మాక్‌డ్రిల్ ఏర్పాటుచేసి అవగాహన కల్పించారు.

కలిదిండి: కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఈవోపీఆర్డీ వై.రాజారావు అన్నారు. బుధవారం పెదలంక, మట్టగుంట గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న 17 సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పెదలంక, మట్టగుంట సర్పంచ్‌లు, బీజేపీ నాయకులు కీర్తి వెంకట రామ్ ప్రసాద్, నంబూరి విజయ నరసింహరాజు, వైద్యాధికారి నశ్విన్ తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎల్ఎస్ భాస్కరరావు

ఓటు హక్కును వినియోగించుకోవాలి

మండవల్లి, జనవరి 24: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటే వజ్రాయుధమని రాబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడుకోవాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు అన్నారు. ఐక్యవేదిక మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం మండవల్లిలో ఓటర్ల దినోత్సవంపై అవగాహన కల్పించారు. ఓటు ప్రాధాన్యతపై వివరించి ఓటర్స్ డే ప్రతిజ్ఞ చేయించారు. మండవల్లి ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బొంతు దుర్గారావు మాట్లాడుతూ ఓటు అనే ఆయుధంతో సుపరిపాలనను అందించే ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలన్నారు. ఐక్యవేదిక మండవల్లి మండల అధ్యక్షుడు పి. అప్పారావు, ఐక్యవేదిక సభ్యుడు రాముడు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన ఉండాలి

ముదినేపల్లి రూరల్, జనవరి 24: ఓటు హక్కు వినియోగంపై ఓటర్లు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ శ్రీనివాసరావు సూచించారు. బుధవారం పలు గ్రామాల్లో ఓటర్లకు అవగాహన సదస్సులు నిర్వహించి మాట్లాడుతూ మాట్లాడుతూ ఈవీఎంలలో ఓటు హక్కును ఎలా వినియోగించుకోవాలో తెలిపారు. ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకుని ప్రజాస్వామ్య పరిరక్షణకు పాటుపడాలని సూచించారు.

మోడల్ పోలింగ్ బూత్‌ను పరిశీలించిన సబ్ కలెక్టర్

చాట్రాయి, జనవరి 24: మండలంలోని చనుబండ జడ్పీ హైస్కూల్‌లో ఉన్న నెం.3 మోడల్ పోలింగ్ బూత్‌ను బుధవారం నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో చనుబండలో 3వ నంబరు, కోటపాడులో 17వ నంబరు పోలింగ్ బూత్‌లను ఎన్నికల కమిషన్ మోడల్ బూత్‌లుగా గుర్తించిందని ఈ బూత్‌లకు అన్ని సదుపాయాలు ఉన్నాయా అని పరిశీలిస్తున్నామన్నారు. గురువారం జరిగే ఓటర్ల దినోత్సవంలో ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించటంతో పాటు సీనియర్ ఓటర్లను సన్మానించాలని అధికారులను ఆదేశించారు. తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు సబ్ కలెక్టర్‌ను కలసి ఓటర్ల జాబితాలు బ్లాక్ అండ్ వైట్‌లో ఉండటం వలన ఫొటోలు సరిగా కన్పించటం లేదని, మండలం మొత్తం ఓటర్ల జాబితాల పీడీఎఫ్ తమకు ఇస్తే కలర్ ప్రింట్స్ తీయించుకుంటామని కోరగా సరేనన్నారు. ఆయన వెంట రెవెన్యూ సచివాలయ సిబ్బంది ఉన్నారు.

కులగణన సర్వే పారదర్శకంగా జరగాలి

కులగణన సర్వే పారదర్శకంగా జరపాలని వలంటీర్లు సచివాలయ సిబ్బందిని సబ్ కలెక్టర్ కోరారు. సర్వే చేస్తున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ వివాదాలకు తావులేకుండా సర్వే చేయాలని, సందేహాలుంటే అధికారులను సంప్రదించాలని కోరారు.

ముదినేపల్లి మండల ఓటర్లు 49,082

ముదినేపల్లి, జనవరి 24 : నూతన ఓటర్ల జాబితా ప్రకారం ముదినేపల్లి మండల ఓటర్ల సంఖ్య 49,082కి చేరింది. గతంలో కంటే సుమారు వెయ్యి ఓట్లు పెరిగాయి. మండలంలోని 61 పోలింగ్ బూత్‌ల పరిధిలో 24,173 మంది పురుష ఓటర్లు కాగా 24,905 మంది మహిళా ఓటర్లు. పురుషుల కంటే మండలంలో మహిళా ఓటర్లు ఎక్కువ. ట్రాన్స్ జెండర్ల ఓట్లు నాలుగు ఉన్నాయి.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



ముసునూరు, జనవరి 24: మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అనేక పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని, నూజివీడు ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు అన్నారు. బుధవారం ముసునూరు జడ్పీ పాఠశాలలో నాలుగో విడత ఆసరా చెక్కును డ్వాక్రా మహిళలకు ఎమ్మెల్యే అందజేశారు. ఎంపీపీ కొండా దుర్గాభవానీ వెంకట్రావు, జడ్పీటీసీ డాక్టర్ ప్రతాప్, వైస్ ఎంపీపీలు కోటగిరి రాజా, పాముల గంగాధర్‌రావు, పీఏసీఎస్ అధ్యక్షులు మూల్పూరి నాగవల్లేశ్వరరావు, ఎంపీడీవో జి.రాణి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రూ.20 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం



ముదినేపల్లి, జనవరి 24 : కైకలూరు నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు సుమారు రూ.20 కోట్లతో గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణాన్ని చేపట్టినట్లు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు తెలిపారు. ముదినేపల్లి మండలం చేవూరులో నిర్మించిన సీసీ రోడ్లను బుధవారం ఆయన ప్రారంభించారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపీపీలు చొప్పర్ల సునీత, రాచూరి రాధ, సర్పంచ్ వల్లభనేని లక్ష్మి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు శీలం రామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు వల్లభనేని సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పరిహారం తక్షణం విడుదల చేయాలి

చాట్రాయి, జనవరి 24: మిచౌంగ్ తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే పరిహారం విడుదల చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేణుగోపాలరెడ్డి, మండల కార్యదర్శి రావూరి వెంకట విచ్చేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ నష్టపోయిన రైతుల జాబితాలు ఆర్బీకేల ద్వారా ప్రభుత్వానికి పంపి నెల రోజులు కావస్తున్నా స్పందించకపోవటం శోచనీయమన్నారు. ఎకరాకు రూ. 20 వేలు చొప్పున పెట్టుబడి రాయితీ తక్షణం విడుదల చేసి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

పూత దశలో సస్యరక్షణ అవశ్యం



చాట్రాయి, జనవరి 24: మామిడి పూత దశలో ఉన్నందున రైతులు తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల ఉద్యాన శాఖాధికారిణి హేమ సూచించారు. కొత్తగూడెం, ఆరుగొలనుపేట గ్రామాల్లో బుధవారం రైతులతో కలసి మామిడి తోటలు పరిశీలించి మాట్లాడుతూ ప్రస్తుతం తోటల్లో మామిడి పూత దశలో ఉన్నదన్నారు. పూత పూర్తిగా వచ్చిన తోటల్లో తేనె మంచు పురుగు ఉధృతి ఉంటే ఇమిడాక్లోప్రిడ్ 0.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చెయ్యాలన్నారు. పూత మాడు ఉంటే సాఫ్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు.